SAMAYAM
epaper.samayamdaily.net APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 01 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 27 సెప్టెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131




కొత్త డీజీపీగా
## శివధర్‌రెడ్డి
నియామకపత్రం అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి

.. వివరాలు 2లో



రాహుల్ అమెరికా
## వ్యాఖ్యల దుమారం
రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

.. వివరాలు 4లో



కుండపోత
## వర్షం
తడిసి ముద్దయిన హైదరాబాద్ నగరం ఇబ్బందులు పడ్డ నగర వాసులు

.. వివరాలు 2లో




# 42శాతం

## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్



### తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల జీవో విడుదల

మాటను నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ వర్గాలు, ప్రజానీకం

"తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవో నంబర్ 9ను విడుదల చేస్తూ... బ్యాక్‌వర్డ్ క్లాస్ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించింది. ఈ నిర్ణయం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 40లో పేర్కొన్న రాష్ట్ర విధానాలకు అనుగుణంగా తీసుకోవడం విశేషం."


**హైదరాబాద్, సెప్టెంబర్26 :** తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల జీవో విడుదలైంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. జీవో విడుదల చేసింది. జీవో నెం.9ను ప్రభుత్వం విడుదల చేసింది. ఆర్టికల్ 40 ప్రకారం స్టేట్ పాలసీ మేరకు నిర్ణయం తీసుకుంది. జీవోలో సామాజిక న్యాయం అంశాన్ని ప్రభుత్వం ప్రస్తావించింది. బీసీ కులగణన ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లను

మిగతా 2 లో

## స్థానిక సంస్థల ఎన్నికలకు సర్కారు సిద్ధం

నేడు రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం
సీఎస్, డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలతో ఈసీ సమావేశం

2





# బీహార్‌లో ఎన్నికల తాయిలం

## ఒక్కో మహిళ ఖాతాలో పదివేలు

### మహిళా రోజ్‌గార్‌కు ప్రధాని మోడీ ప్రారంభం

న్యూఢిల్లీ/పాట్నా : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది. ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభించడం ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. దిల్లీలో ఉన్న మోదీ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో

మిగతా 4 లో



## జూబ్లీహిల్స్‌పై కేసీఆర్ సమాలోచనలు

సీనియర్ నేతలతో తాజా పరిస్థితులపై సమీక్ష
జూబ్లీహిల్స్ అభ్యర్థిగా మాగంటి సునీత ప్రకటన
చాకలి ఐలమ్మకు కేసీఆర్ నివాళి

3

త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయని కేసీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో ప్రతి అంశం పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు అన్ని నివేదికలు చెబుతున్నాయని కేసీఆర్ అన్నారు.

రేవంత్ వైఖరి వల్లనే
# ఎల్‌అండ్‌టీ నిష్క్రమణ



ఇది రాష్ట్ర ప్రభుత్వానికి మాయని మచ్చ
ఎయిర్‌పోర్టు మెట్రోను ఒప్పుకోని సీఎం
అందుకే ఎల్‌అండ్‌టీ ఈ నిర్ణయం
మండిపడ్డ బిఆర్‌ఎస్ నేత కేటీఆర్

సీఎం రేవంత్ వైఖరి వల్లే ఎల్‌అండ్‌టీ మెట్రోను వదులుకుందని కేటీఆర్ అన్నారు. అనేక కష్టాలు ఎదుర్కొని ఎల్‌అండ్‌టీ.. మెట్రోను నడిపింది. దాని నిష్క్రమణ రాష్ట్ర ప్రభుత్వానికి మాయని మచ్చ. పెట్టుబడిదారులను సాక్షాత్తూ ముఖ్యమంత్రే బెదిరిస్తున్నారు. నియంతలా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ మెట్రోకు మంచి డిమాండ్ ఉండేదని, తాము దిగిపోయే నాటికి దేశంలోనే రెండో అతిపెద్ద వ్యవస్థగా ఉందన్నారు.

మిగతా 3 లో

# అనంత వర్సిటీలో అక్రమాలపై కమిటీ

ఆంధ్రా వర్సిటీ విషయంలో ఆందోళన సరికాదా
అసెంబ్లీలో మంత్రి లోకేశ్ వెల్లడి



**అమరావతి :** అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో 2019-24 నడుమ జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభలో తెలిపారు. కంప్యూటర్ల కొనుగోలులో దుర్వినియోగం, యూనివర్సిటీ-వాహనాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం, నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు, నియామకాలు,

మిగతా 5 లో



# వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మతో తొలిగా ఉత్సవాలు మొదలైనట్లు ఆచారం
మాడవీధుల్లో కనువిందు చేయనున్న వాహనసేవలు
రోజుకో సేవలో విహరించనున్న స్వామివారు
చక్రస్నానంతో ముగియనున్న ఉత్సవాలు



**తిరుమల :** తిరుమలేశుని ఆలయంలో నిత్యకళ్యాణం-పచ్చుతోరణంగా జరిగే బ్రహ్మోత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈ నెల 23నుంచి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగబోతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాన్ని సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే జరిపించినట్లు భవిష్యోత్తర పురాణం పేర్కొంటోంది. బ్రహ్మదేవుడు స్వయంగా ఆరంభించిన ఉత్సవాలు కావటంతో, ఇవి 'బ్రహ్మోత్సవాలు' అయ్యాయని అంటారు. మరో వ్యాఖ్యానం ప్రకారమైతే- నవాహ్నిక దీక్షతో, నవబ్రహ్మలు

మిగతా 5 లో



# గుజరాత్ తర్వాత మనమే

నాలుగు కొత్త పోర్టుల వల్ల కార్గో రవాణా పెరుగుతుంది

కార్గో రవాణాలో గుజరాత్ తర్వాత మనమే ఉన్నాం అని సిఎం చంద్రబాబు అన్నారు. కొత్తగా వచ్చే నాలుగు పోర్టుల వల్ల కార్గో రవాణా పెరుగుతుందన్నారు.

నాణ్యమైన లాజిస్టిక్స్ ఏపీకి వచ్చేలా ప్రణాళికలు
లాజిస్టిక్స్‌లో ప్రస్తుతం 3లక్షల మంది పని
వైకాపా హయాంలో దెబ్బతిన్న రాష్ట్రం ఇమేజ్
త్వరలోనే ఐటీ హబ్‌గా విశాఖపట్టణం
అసెంబ్లీలో సీఎం చంద్రబాబునాయుడు

2

# స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ 42 శాతం

మొదటి పేజీ తరువాయి

కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వేను అనుసరించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించింది. నూతన పీఆర్ చట్టానికి అసెంబ్లీ ఆమోదించిన సవరణలకు అనుగుణంగా డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఎస్టీ, ఎస్సీ, బీసీలు ఇలా అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం రిజర్వ్ చేశారు. షెడ్యూల్డ్ ఏరియాల్లో రిజర్వేషన్ సీట్లన్నీ కూడా ఎస్టీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా, మొత్తం సీట్లలో 50 శాతానికి తగ్గకుండా చేశారు. ఈ ఏరియాల్లోని




మండల అధ్యక్షుల పదవులన్నీ కూడా ఎస్టీలకే రిజర్వ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ రిజర్వేషన్ల ఖరారును పంచాయతీరాజ్ కమిషనర్, మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ స్థానాలను జిల్లా కలెక్టర్లు, మండలాల్లో ఎంపీటీసీ రిజర్వేషన్లను ఆర్డీవోలు ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కల ఆధారంగా.. బీసీ రిజర్వేషన్లను కులగణన (ఎస్ఈఈఈపీసీ) సర్వే 2024 ప్రకారం పూర్తి చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేశాయి. జిల్లాల వారీగా జిల్లా పరిషత్ సీఈఓలు, జిల్లా పంచాయతీ అధికారులతో సమీక్షలు పూర్తిచేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ అధికారులు, చెక్‌పోస్టులు, లాజిస్టిక్స్ వంటి అంశాలను ఎంపీడీవోలు ఖరారు చేశారు. గురువారం రాత్రి నుంచే పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు ఈ సమాచారాన్ని క్షేత్రస్థాయిలోని అధికారులకు అందజేశారు.



## స్పీకర్‌తో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులకు ఇప్పటికే కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు వివరణ ఇచ్చారు. అయితే, ఈ నెల 30వ తేదీ వరకూ కడియం శ్రీహరి గడువు కోరారు. ఈనెల 29 నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యక్ష విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ 6వ తేదీ నుంచి 23వ తేదీ వరకు విదేశీ పర్యటనకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెళ్లనున్నారు. విదేశీ పర్యటనకు ముందే ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంపై విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు భేటీ- కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## మహిళలతో పెట్టుకుంటే అంతే సంగతులు

### కేటీఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క

### రవీంద్రభారతిలో బతుకమ్మ ఉత్సవాలకు హాజరు




**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** మహిళలతో పెట్టుకున్న వారు ఎవరూ బాగుపడరని మంత్రి సీతక్క హెచ్చరించారు. సొంత ఇంట్లో ఆడపడచుకు న్యాయం చేయలేని వారు తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం గాంధీ భవన్‌లో మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. సొంత ఇంటి ఆడబిడ్డను గోస పెడుతున్నారని.. మాజీ మంత్రి కేటీఆర్‌కు ఇది తగునా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేపడుతున్న మహిళా సంక్షేమ కార్యక్రమాల్లో మహిళా కాంగ్రెస్ భాగస్వామ్యం కానుందని ఉద్ఘాటించారు. మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పుకొచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాదని.. మహిళలను బస్సు ఓనర్లను చేశామని ఉద్ఘాటించారు. అభయహస్తం నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం కాజేసిందని మంత్రి సీతక్క ఆరోపించారు. మరోవైపు... రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా మం ఓత్రి సీతక్క హాజరయ్యారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం రవీంద్ర భారతిలో పువ్వుల బతుకమ్మ పాటను ఆవిష్కరించారు. తెలంగాణ పర్యాటక సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పువ్వుల బతుకమ్మ పాటను నిర్వాహకులు రూపొందించారు. సింగర్స్ గడ్డం సంతోష్, శ్రీనిధి పువ్వుల బతుకమ్మ పాటను ఆలపించగా.. నయని పావని నటించింది. ఈ సందర్భంగా సింగర్స్, నాయని పావనీని మంత్రి సీతక్క, కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరా శోభన్ సన్మానించారు.

## భారత్, అమెరికా వాణిజ్య చర్చలు

### పరస్పర విశ్వాసంతో అడుగులు

### పీయూష్ గోయల్ నేతృత్వంలో బృందం వెల్లడి



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 26:** భారత్, అమెరికాలకు మేలు చేసేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు- కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. అగ్రరాజ్యం సైతం భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింత పెంచుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు- తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఇరుదేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించాయన్నారు. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నా యని.. ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు- పేర్కొంది. వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు- వాణిజ్య శాఖ వెల్లడించింది. మరోవైపు అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవ్వనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. ఈ సదస్సుకు అనుబంధంగా జరగనున్న మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీలో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన విషయాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దానిపై ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ ట్రంప్ తాజాగా ఫార్మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించారు. దీంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారాయి. అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15శాతం భారత్ సరఫరా చేసినవే. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్, సన్‌ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి సంస్థల మొత్తం ఆదాయంలో 30-50శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లతో అమెరికా మార్కెట్‌లో ఈ ఔషధాల ధరలు రెట్టింపు కానున్నాయి.




## కుండపోత వర్షం

### తడిసి ముద్దయిన హైదరాబాద్ నగరం ● ఇబ్బందులు పడ్డ నగర వాసులు

### పటాన్‌చెరు వద్ద హైవేపై నిలిచిన ట్రాఫిక్ ● కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. శుక్రవారం కూడా భారీ వర్షం కురుస్తుండటంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం అప్రమత్తమైంది. ట్రాఫిక్ సమస్యలు, ప్రజల భద్రతా దృష్ట్యా వివిధ కంపెనీలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సూచించింది. పరిస్థితిని అర్థం చేసుకొని సహకరిం చాలని కోరింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మరోవైపు హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఛత్రినాక, తార్నాక, హబ్సిగూడ, నాచారం, కూకట్‌పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట్, ప్రగతినగర్, ఆల్విన్ కాలనీ, చార్మినార్, యూకత్‌పురా, ఓయూ క్యాంపస్, హైదర్‌నగర్, బాచుపల్లి, వివేకానంద నగర్, చార్మినార్, చాంద్రయణగుట్ట, బహదూర్‌పురా, లాలాపేట్, మల్లాపూర్, ఉప్పుగూడ, బార్కస్, బషీర్‌బాగ్, అబిడ్స్, కోఠి సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. మియాపూర్ మంజీరా పైపులైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మైహోం మంగళ మార్గంలో రైల్వే అండర్ పాస్‌లోకి వరదనీరు చేరింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మియాపూర్ మంజీరా పైపు లైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మై హోం మంగళ మార్గంలో రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి 65వ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్ వద్ద నుంచి రుద్రారం వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంగారెడ్డి నుంచి ఇస్నాపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వరద నీటిలో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. దీంతో కార్యాలయాలకు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

## అప్రమత్తంగా ఉండండి

### వర్షాలపై అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు

### పరిస్థితిని సమీక్షించాలని కలెక్టర్లకు ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ మహానగరంతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆ క్రమంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. అలాగే నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని.. ఆ దిశగా సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలంటూ సీఎస్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగం ఉద్యోగులకు ఈ రోజు.. అంటే శుక్రవారం సాఫ్ట్ వేరు నిపుణులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలంటూ ఐటీ కంపెనీలను ఇప్పటికే సూచించింది. అలాగే వివిధ ప్రాంతాల్లోని రహదారులపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ బృందాలు రంగలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

## కిషన్ రెడ్డి చేసిందేమిటో చర్చకు సిద్ధం

### మహేశ్ కుమార్ గౌడ్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ముద్దాయిగా నిరూపించబడ్డారని శిక్ష తప్పదని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఫార్ములా- ఈ కార్ రేసులో కేటీఆర్ తప్పు చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..మూసి సుందరీకరణను బిఆర్ఎస్‌తో పాటు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దు అని సూచించారు. తెలంగాణకు కిషన్ రెడ్డి తెచ్చిన ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం అని సవాల్ విసిరారు. కేంద్రం దగ్గర బిసి బిల్లు ఎందుకు పెండింగ్‌లో ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రయత్నిస్తే బిసి బిల్లు ఆమోదం పొందుతుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సర్కారు సిద్ధం

### నేడు ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం


### సీఎస్, డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలతో ఈసీ సమావేశం

### సాయంత్రానికి స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్!

**హైదరాబాద్, సెప్టెంబర్26:** స్థానిక సంస్థల ఎన్నికలకు తెలంగాణ ప్రభుత్వం సర్వం సిద్ధమైంది. నేడు(శనివారం) ఉదయం 11 గంటలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల సంఘంసమావేశం నిర్వహించనున్నది. శనివారం సాయంత్రానికి స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా, మరోవైపు రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తు దాదాపు పూర్తయింది. పంచాయతీరాజ్ శాఖ క్షేత్రస్థాయిలో జిల్లా పరిషత్ ముఖ్య అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులతో సంప్రదింపులు చేస్తోంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే రిటర్నింగ్ అధికారుల నుంచి చెక్‌పోస్టుల వరకు అన్నింటినీ ఎంపీడీవోలు ఖరారు చేశారు. గురువారం రాత్రే పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు పంపారు. ఇక క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది ఎవరూ సెలవులు తీసుకోవద్దనే సూచన కూడా వెళ్లినట్టు సమాచారం.

## కొత్త డీజీపీగా శివధర్‌రెడ్డి

### నియమించిన తెలంగాణ సర్కారు.



**హైదరాబాద్, సెప్టెంబర్26:** తెలంగాణ కొత్త డీజీపీగా శివధర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. 1994 ఐపీఎస్‌బ్యాచ్‌కు చెందిన శివధర్ రెడ్డి.. ప్రస్తుతం తెలంగాణ ఇంటలిజెన్స్ ఛీఫ్ గా పని చేస్తున్నారు. అక్టోబర్ 1న ఆయన డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు. హైదరాబాద్ లో జన్మించిన శివధర్ రెడ్డి.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలేకలాన్ (పెద్దతుండ్ల) గ్రామానికి చెందినవారు. 2016 నయీం ఎన్ కౌంటర్‌లో శివధర్‌రెడ్డి ఆపరేషన్ ను ప్లాన్‌చేశారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇంటెలిజెన్స్ చీఫ్ గా శివధర్ రెడ్డి నియామకమయ్యారు. ఆగస్టు 2024లో డీజీపీగా ప్రమోషన్ పొందారు. గ్యాలంట్రీ మెడల్, పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్, ఐక్యరాజ్యసమితి మెడల్ సహా అనేక అవార్డులను శివధర్ రెడ్డి అందుకున్నారు.

## గాంధీ జయంతి రోజే.. దసరా

### మందు షాపులు బంద్ అంటూ బోర్డులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పండుగ దసరా.. ఈ పర్వదినాన రెండు రాష్ట్రాల ప్రజలు ఫుల్ జోష్‌లో ఉంటారు. బంధుమిత్రులందరినీ తమ ఇళ్లకు ఆహ్వానించి సంతోషంగా దసరాను జరుపుకుంటారు. దసరా రోజున ముక్కా, సుక్కతో ఫుల్ ఖుషీ అవుతారు. అయితే, ఈసారి మాత్రం ఆ పరిస్థితి కనిపించేలా లేదు. ఎందుకంటే.. దసరా పండుగ అక్టోబర్ 2వ తేదీన వచ్చింది. అక్టోబర్ 2 గాంధీ జయంతి. దీంతో ఆ రోజున మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధం. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఇప్పటికే చాలా వైన్స్ షాపుల వద్ద దసరా రోజున వైన్ షాప్స్ బంద్ అంటూ ప్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. సోషల్ మీడియాలోనూ ఈ అంశంపై రీల్స్ మీద రీల్స్ చేస్తున్నారు నెటిజన్లు. మరోవైపు.. అసలే దసరా.. అక్టోబర్ 2న మందు బంద్ అనడంతో.. మద్యం ప్రియులు వైన్ షాపుల వద్దకు పరుగెత్తుకెళ్తున్నారు. ముందే స్టాక్ తీసుకెళ్తున్నారు.

27-09-25 Samayam_Layout 1 9/27/2025 2:42 AM Page 3



# జూబ్లీహిల్స్‌పై కేసీఆర్ సమాలోచనలు

- సీనియర్ నేతలతో తాజా పరిస్థితులపై సమీక్ష
- జూబ్లీహిల్స్ అభ్యర్థిగా మాగంటి సునీత ప్రకటన
- చాకలి ఐలమ్మకు కేసీఆర్ నివాళి



**హైదరాబాద్/గజ్వేల్, సెప్టెంబర్ 26:** త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయని, ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకొని విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్‌తోపాటు పలువురు నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రతి అంశం పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు అన్ని నివేదికలు చెబుతున్నాయని కేసీఆర్ అన్నారు. క్షేత్ర స్థాయిలో కిందిస్థాయి కార్యకర్తలను అప్రమత్తం చేసి తద్వారా ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్ని అప్రమత్తం చేయాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.

### చాకలి ఐలమ్మకు కేసీఆర్ నివాళి

పాలకులు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను అటు న్యాయస్థానాల్లో ఇటు క్షేత్ర స్థాయిలోనూ పోరాడి గెలవాలనే ప్రజాస్వామిక స్ఫూర్తిని చిట్యాల ఐలమ్మ తెలంగాణ సమాజానికి అందించింది అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చిట్యా(చాకలి)ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని కేసీఆర్ స్మరించుకున్నారు. నాటి రాచరిక పాలనలో, భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థ మీద ఐలమ్మ చేసిన పోరాటం.. తెలంగాణ మహిళా చైతన్యానికి బహుజన వర్గాల ప్రజాస్వామిక, ఆత్మగౌరవ పోరాట పటిమకు నిదర్శనం అన్నారు. ఎక్కడా రాజీ పడకుండా, సబ్బండ వర్గాల అభ్యున్నతి సంక్షేమమే ప్రధానంగా గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అమలు చేసిన విధానాలను, పథకాలను కొనసాగించడం ద్వారా మాత్రమే చాకలి ఐలమ్మకి మనమందించే ఘన నివాళి అని కేసీఆర్ స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్ అభ్యర్థిగా మాగంటి సునీత

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని భారత రాష్ట్ర సమితి ప్రకటించింది. ఇటీవల మృతిచెందిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు టికెట్ కేటాయించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. దీంతో అభ్యర్థి పేరును పార్టీ వెల్లడించింది. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. త్వరలో దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థిగా భారత రాష్ట్ర సమితి ప్రకటించిన అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడారు. తనపై విశ్వాసంతో ఉపఎన్నికకు అభ్యర్థిగా పార్టీ అవకాశం కల్పించిందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



తనకు ప్రజల మద్దతు, ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నానని సునీత పేర్కొన్నారు.

# రేవంత్ వైఖరి వల్లనే ఎల్‌అండ్‌టీ నిష్క్రమణ

- ఇది రాష్ట్ర ప్రభుత్వానికి మాయని మచ్చ
- ఎయిర్‌పోర్టు మెట్రోను ఒప్పుకోని సీఎం
- అందుకే ఎల్‌అండ్‌టీ ఈ నిర్ణయం
- మండిపడ్డ బిఆర్‌ఎస్ నేత కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** సిఎం రేవంత్ వైఖరి వల్లే ఎల్‌అండ్‌టీ మెట్రోను వదులుకుందని కెటిఆర్ అన్నారు. అనేక కష్టాలు ఎదుర్కొని ఎల్‌అండ్‌టీ.. మెట్రోను నడిపింది. దాని నిష్క్రమణ రాష్ట్ర ప్రభుత్వానికి మాయని మచ్చ. పెట్టుబడిదారులను సాక్షాత్తూ ముఖ్యమంత్రే బెదిరిస్తున్నారు. నియంతలా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ మెట్రోకు మంచి డిమాండ్ ఉండేదని, తాము దిగిపోయే నాటికి దేశంలోనే రెండో అతిపెద్ద వ్యవస్థగా ఉందని కేటీఆర్ అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడే ఎయిర్‌పోర్టు మెట్రోకు కూడా శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో వైఎస్ఆర్ ఓఆర్ఆర్ నిర్మించినప్పుడు ఒక మంచి పని చేశారని, రోడ్డు పక్కన కొంత భూమిని అదనంగా వదిలారని చెప్పారు. 400 కి.మీ మేర మెట్రో విస్తరణకు కేసీఆర్ ప్రణాళికలు రచించారు. దశలవారీగా మెట్రో విస్తరణకు గతంలో కేబినెట్ ఆమోదం తెలిపింది. అధికారంలోకి రాగానే రేవంత్‌రెడ్డి అనాలోచితంగా ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేశారు. ఆయన తలచుకుంటే ఇప్పటికే ఎయిర్‌పోర్టు మెట్రో పూర్తయ్యేది. భూసేకరణ ఇబ్బంది కూడా లేదు. ఎయిర్‌పోర్టు మెట్రో కొనసాగించాలని ఎల్‌అండ్‌టీ కోరింది. అందుకు రేవంత్‌రెడ్డి ఒప్పుకోలేదు. అప్పటి నుంచే సీఎం, ఎల్‌అండ్‌టీ మధ్య గొడవ మొదలైంది. రేవంత్‌రెడ్డి వల్ల ఆ సంస్థ చాలా ఇబ్బంది పడింది. ఆయన వైఖరి వల్లే ఆ సంస్థ వెళ్లిపోతోంది.

### అరెస్టుకు భయపడేది లేదు: కెటిఆర్

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. తన అరెస్టుపై కాంగ్రెస్ నేతలు కలలు కంటున్నారని కేటీఆర్ విమర్శించారు. తన అరెస్టు కోసం కాంగ్రెస్ నేతలు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అరెస్టు చేసుకోండి... అరెస్టు భయం తనకు లేదని స్పష్టం చేశారు. . తన అరెస్టుతో సీఎం రేవంత్‌రెడ్డికి పైశాచిక ఆనందం తప్ప మరొకటి రాదని కేటీఆర్ మండిపడ్డారు. తాను ఏ తప్పు చేయలేదని... ఏం చేసుకుంటారో చేసుకోవాలని సవాల్ విసిరారు. తనతో రేవంత్‌రెడ్డి లై డిటెక్టర్ టెస్ట్‌కు రావాలని ఛాలెంజ్ చేశారు కేటీఆర్. ఏసీబీ కేసు తనపై ఉందని... రేవంత్‌రెడ్డిపైనా ఏసీబీ కేసుందని గుర్తుచేశారు. ఆర్ఎస్ బ్రదర్స్‌కు ప్రజా సమస్యలు పట్టవని విమర్శించారు. ఆర్ఎస్ బ్రదర్స్‌కు తాను ఏ కారులో తిరుగుతున్నానో మాత్రమే కావాలని ఎద్దేవా చేశారు.

# కోల్ ఇండియా కార్మికులకు లక్ష

- కార్మికులకు పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్
- ప్రీమియం లేకుండా బీమా కవరేజ్
- ఎక్స్-గ్రేషియా రూ. 25 లక్షలకు పెంపు
- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ,సెప్టెంబర్26:** దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న కీలక పరిశ్రమల వృద్ధి వేగం పుంజుకుంది. గత కొన్ని నెలలుగా, బొగ్గు రంగం ఉత్పత్తి, సామర్థ్యంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. అంతేకాకుండా, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే బొగ్గు పరిశ్రమలోని ప్రతి సభ్యుని సంక్షేమం ప్రధాన ప్రాధాన్యతగా ఉండేలా చూసుకోవడానికి అవిశ్రాంతంగా కృషి చేసింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దార్శనిక మార్గదర్శకత్వంలో కీలక మైలురాళ్లను సాధించామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.ప్రతి కార్మికుడి సహకారాన్ని గౌరవించాలని కేంద్ర ప్రభుత్వ నిబద్ధతతో ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇందుకు అనుగుణంగా, కోల్ ఇండియా లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలు, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లోని కార్మికులకు పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ (%ూా=%) ఆమోదించడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ప్రతి కార్మికుడు వారి అంకితభావం, అవిశ్రాంత కృషికి బహుమతిగా రూ. 1,03,000 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు బీమా కవర్ రూ. 1 కోటి వరకు గణనీయంగా పెంపు. ఇది కుటుంబాలకు బలమైన ఆర్థిక భద్రతను అందిస్తుంది. ఉద్యోగులు ఎటువంటి బీమా ప్రీమియం చెల్లించాల్సిన పని లేదు. మొదటిసారిగా, శాశ్వత ఉద్యోగులు కాని వారికి బీమా కవర్ ప్రవేశ పెట్టడం జరిగింది. ఇది సమగ్ర సంక్షేమం వైపు ఒక సమగ్ర అడుగును సూచిస్తుంది. ఉద్యోగులు ఎటువంటి బీమా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. కోల్ ఇండియా లిమిటెడ్ , దాని అనుబంధ సంస్థలలో, కార్మికుడి వరకు, సమానత్వం, ఐక్యత, కోల్ పరివార్ ఒక గుర్తింపును సూచిస్తూ యూనిఫాం డ్రెస్ కోడ్ పరిచయం. ఎక్స్-గ్రేషియా పరిహారాన్ని రూ. 15 లక్షల నుండి రూ. 25 లక్షలకు పెంచారు. ఇది కష్ట సమయాల్లో కుటుంబాలను ఆదుకోవాలనే నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. పండుగ సీజన్ ప్రారంభంలో వస్తున్న ఈ ప్రకటన, ప్రతి కార్మికుడి గౌరవం, సంక్షేమంతో అభివృద్ధి ముడిపడి ఉందన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. ఇది కేవలం ఆర్థిక బహుమతి మాత్రమే కాదు, దేశానికి ఇంధనంగా నిలిచే బొగ్గు పరివార్‌కు గుర్తింపు, కృతజ్ఞత, సాధికారత సందేశమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వం, విధానాలలో ప్రజలను హృదయంలో ఉంచడానికి మార్గనిర్దేశం చేసింది. పనితీరులో దృఢంగా ఉండటమే కాకుండా కరుణ స్ఫూర్తితో కూడిన రంగాన్ని నిర్మించడానికి మోదీ దిశానిర్దేశం స్ఫూర్తినిస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. భారతదేశ బలం దాని కార్మికుల ఐక్యత, దాని దృక్పథంలోని స్పష్టతలో ఉందని బొగ్గు పరివార్ కలిసి నిరూపించింది. మన సోదరభావంలోని ప్రతి సభ్యునికి కొత్త ప్రమాణాలను నిర్దేశించడానికి, బలమైన, సురక్షితమైన భవిష్యత్తును నిర్మించడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారుప్రధాని మోదీ చెప్పినట్లుగా, "సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే మంత్రం ద్వారా మార్గనిర్దేశం చేసిన భారతదేశం ఇప్పుడు ప్రపంచాన్ని నెమ్మదిగా వృద్ధి పట్టు నుండి విముక్తి పొందేలా సహాయపడే స్థితిలో ఉంది." ఈ మాటలు బొగ్గు రంగం పురోగతి, సంక్షేమం రెండింటికీ మూలస్తంభంగా ఉండేలా చూసుకుంటూ, నూతన దృఢ సంకల్పంతో ముందుకు సాగడానికి మనకు స్ఫూర్తినిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.



# భారీ వర్షం హెచ్చరిక

### అప్రమత్తం అయిన ప్రభుత్వం

### అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్

**హైదరాబాద్,సెప్టెంబర్26 :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వచ్చే 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లతో పాటు– సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.భారీ వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు మంత్రి గారు శుక్రవారం నాడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ జితేందర్‌తో కలిసి కలెక్టర్లు, ఎస్పీలు, హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులతో –టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గడిచిన 24 గంటల్లో భారీ వర్షాలు కురిసిన ప్రధానంగా రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలు, వచ్చే 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఇరిగేషన్, రవాణా, విద్యుత్, హైడ్రా, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేసి జనజీవనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో అతిపెద్ద పండుగైన దసరాకు ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి ప్రజలు సొంత గ్రామాలకు వెళతారని, వారి రవాణాకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలని సూచించారు. వికారాబాద్ జిల్లాలో కురిసిన అతిభారీ వర్షాల వల్ల మూసీ నదిలోకి భారీ వరద వస్తోందని, దీనిని దృష్టిలో పెట్టు–కొని మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైనచోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే శివాజీ బ్రిడ్జి కింద భూలక్ష్మి ఆలయం సమీపంలోని లోతట్టు– ప్రాంతాల్లో నివసిస్తున్న 55 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు– వెల్లడించారు. మూసీ నదిలో నీటి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణలోనే ఉండాలని సూచించారు. ముఖ్యంగా హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలకు భారీ వరద వస్తున్నందున ముందు జాగ్రత్త చర్యగా వస్తున్న వరదను అంచనా వేసి అంతే పరిమాణంలో ఈ రెండు జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. రెండు జలాశయాల నుంచి నీటిని విడుదల చేసే సమయంలో లోతట్టు– ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైతే షెల్టర్ హోమ్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండాయని, రాబోయే వర్షాల వల్ల చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే లో–లెవెల్ కాజ్‌వేలు వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు– చేయాలని ఆదేశించారు. జలాశయాలు, జల వనరుల వద్ద సెల్ఫీలు దిగకుండా యువతను నివారించాలని సూచించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రెస్క్యూ ఆపరేషన్ టీ–మ్‌లను, అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు.

## ఓజీ టిక్కెట్ ధరల పెంపు వీల్లేదు

### సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థించిన హైకోర్టు

**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఓజీ' మూవీ టికెట్ ధరల పెంపుపై తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. టిక్కెట్ ధలు పెంచేందుకు నిరాకరించింది.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమాకు తెలంగాణ హైకోర్టు మరోసారి షాకిచ్చింది. రివ్యూ తర్వాత కూడా పెంపునకు న్యాయస్థానం అంగీకరించలేదు. 'ఓజీ' బెనిఫిట్ షోలకు, ఆ సినిమా టికెట్ రేట్లను పెంచుకునేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ గతంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులే కొనసాగుతాయని స్పష్టం చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులే అక్టోబర్ 9వ తేదీ వరకు కొనసాగుతాయని హైకోర్టు స్పష్టం చేసింది.

## బతుకమ్మకుంట ప్రారంభం వాయిదా



**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** అంబర్‌పేటలో పునర్నించిన బతుకమ్మ కుంట ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. వర్షం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరగాల్సిన కార్యక్రమాన్ని ఆదివారానికి వాయిదా వేశారు. హైదరాబాద్ నగరంలోని బాగ్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట ఆక్రమణకు గురైంది. పెద్దమొత్తంలో భవంతులు వెలిశాయి. మిగిలిన కొద్ది స్థలం కూడా కబ్జాదారుల చేతుల్లో ఉంది. దాన్ని వాహనాల పార్కింగ్ స్థలంగా వినియోగించుకునేవారు. ముళ్ల కంపలు, చెత్తాచెదారం వేసేవారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత బతుకమ్మ కుంట ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ దస్త్రాలను ఆధారాలుగా చూపారు. రంగంలోకి దిగిన హైడ్రా.. ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంది. అక్కడ ఎక్స్‌కవేటర్లతో తవ్వగా మీటరు లోతులోనే నీరు ఉబికివచ్చింది. దాదాపు రూ. 7.15 కోట్లు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టింది. పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దింది. చిన్న పిల్లలు ఆడేందుకు ఆటస్థలం, వృద్ధులు సేద తీరేందుకు బెంచీలు తదితరాలు ఏర్పాటు చేసింది. చుట్టూ మెట్లతో కాంక్రీట్ గోడ కట్టింది. ప్రస్తుత వర్షాలకు కుంటలో నిండుగా నీరు చేరి జలకళ సంతరించుకుంది.

27-09-25 Samayam_Layout 1 9/27/2025 2:42 AM Page 4



## సంపాదకీయం



# రాజకీయ విలువలు లేని నేతలు!

రాజకీయమంటే పదవులు కావాలి. పదవి, హోదా ఉంటేనే ప్రజల గురించి మాట్లాడుతారు. ఎపిలో వైకాపానేత జగన్‌కు ఇది బాగా సరిపోతుంది. విపక్షనేత హోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని మొండికేశారు. చివరకు హైకోర్టు గడప తొక్కారు. ఐదేళ్లు సిఎంగా పని చేసిన వ్యక్తికి నిబంధనలు తెలియకపోవడం, అసెంబ్లీకి రాకపోవడం సిగ్గుచేటు. తనకు విపక్ష పదవి కావాలని దేబురిస్తున్నారు. బయట ఉండి విమర్శలు చేస్తున్నారు. నిజానికి రాజకీయాల్లో రోజురోజుకూ విలువలు పడిపోతున్నాయి. సిద్ధాంతాలు పక్కకు పోయాయి. ఎదుటి పార్టీని ఎలా దిబ్బతీయాలా అన్నదే ఇప్పుడు అన్నిపార్టీల ప్రథమ లక్ష్యంగా మారింది. అధికారంలో ఉంటే అక్రమాలకు పాల్పడడం, ఆస్తులు సంపాదించుకోవడం, ఓడితే ఎదుటి పార్టీని విమర్శించడం అలవాటు చేసుకున్నారు. బిఆర్‌ఎస్, వైకాపాలు ఇదే కోవలో ఉన్నాయి. తమ పాలనలో జరిగిన అవినీతి వ్యవహారాలపై మాత్రం మాట్లాడడంలేదు. ఇకపోతే కొందరు నేతలు అధికారం ఉన్న పార్టీలో ఉండడం అలవాటు చేసుకున్నారు. ఎక్కడ అధికారం ఉంటే అక్కడ చేరిపోతున్నారు. విపక్ష పార్టీలు కూడా సమర్థంగా పనిచేయడం లేదు. అధికార పార్టీని విమర్శించడం, ఐదేళ్ల తరవాత అదృష్టం ఉంటే మళ్లీ మనదే అధికారం అన్న ధోరణిలో రాజకీయాలు నెరపుతున్నాయి. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి.. పరస్పర విమర్శలతో పబ్బం గడుపుకునే పరిస్థితిలో రాజకీయ పార్టీలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. అనేక విషయాల్లో జగన్ అధికార టిడిపిపై విమర్శలు చేస్తే సరిపోతుందని ఎదురుదాడికి దిగుతున్నారు. తన హయాంలో జరిగిన పాపాలపై జగన్ ఏనాడూ విచారణ కోరుకోవడం లేదు. అందుకే రాజకీయాల్లో విలువలు లేవనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. ఇకపోతే తెలంగాణలొ పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి, భ్రష్టు పట్టించిన బిఆర్‌ఎస్, ఎపిలో ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో దివాళా తీయించిన జగన్ ఇప్పుడు ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారు. ఈ రెండు పార్టీల నేతలు తమ తప్పులను, అప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఇప్పుడున్న ప్రభుత్వాలపై విరుచుకుపడుతున్నారు. ప్రాంతీయ పార్టీలు, సిద్ధాంత భావజాలాన్ని కలిగి ఉండడం లేదు. తమ రాజకీయ అవసరాన్ని ప్రజల అవసరంగా చిత్రీకరించి కొందరు పార్టీలు మారుతున్నారు. దీనికి ఎవరూ మినహాయింపు కాదు. అందుకే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది. సుప్రీం తీర్పు ఇచ్చి సూచనలు చేశాక, తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని పార్టీమారిన పదిమంది ఎమ్మెల్యేలు బుకాయిస్తున్నారు. ఎంతటి నేతలైనా అధికారపార్టీలో చేరడానికి వెరవడం లేదు. రాజకీయనిబద్ధత పక్కకుపెడుతున్నారు. రాజకీయాల్లో విలువలు లేవని, వ్యక్తులకు పార్టీల పట్ల విశ్వాసం కన్నా పదవులపైనే మోహం ఉందనడానికి తాజా రాజకీయాలే ఉదాహరణ. ఇకపోతే మోడీ పనితీరు నచ్చిందని, దేశానికి ఆయనే ఆశాజ్యోతి అని బిజెపిలో చేరేముందు కొందరు ప్రవచానాలు వల్లిస్తున్నారు. గతంలో తెలంగానలో పలువురు బిఆర్‌ఎస్‌లో చేరగా దానిని బిఆర్‌ఎస్ గర్వంగా చాటుకుంది. కానీ ఇప్పుడు తమ ఎమ్మెల్యేలు పార్టీని వీడేసరికి గగ్గోలు పెడుతోంది. ఇలా చేయడంలో కేవలం స్వార్థ రాజకీయాలు తప్ప మరోటి కాదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడ పదవులు అనుభవించి, పార్టీ అధినేత అడుగలకు మడుగులొత్తిన వారు అధికారం కోల్పోగానే అధికారంలో ఉన్న పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. అనేక పదవులు అనుభవించి, రాజకీయంగా ఎదుగుదలకు కారణం అయిన పార్టీని, దాని అధినేతలను తిట్టాల్సినన్ని తిట్లు తిట్టి మరీ పార్టీలు మారుతున్నారు. ఇదంతా రాజకీయంగా తమ అవసరం కోసమే అన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. రాజకీయ ఉనికి కోసం అనేక కారణాలు చూపుతున్నారు. అధికారంలో ఉన్నవారు రాజకీయ ఎత్తులు వేస్తూ వీరిని అక్కున చేర్చుకుంటున్నారు. పార్టీ మారదల్చుకుంటే మారాలి. అంతేగానీ వీడుతున్న పార్టీపై విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరని గుర్తించాలి. రాజకీయ అవసరార్థం ఎప్పుడు ఏదైనా మాట్లాడే అలవాటు మన రాజకీయ నేతలకు ఉంది. చాలామంది ప్రాంతీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు అవకాశం వస్తే ఢిల్లీ గద్దెను ఎక్కాలనే కుతూహలంతో ఉన్నవారు అనేకులు ఉన్నారు. ఏ పార్టీకి కూడా సిద్ధాంతం లేదన్నది తాజా పరిణామాలను బట్టి గమనిం చాలి. అధికారమే అన్ని పార్టీల సిద్ధాంతం. అధికారం ఉంటేనే నేతలు పార్టీని అంటిపెట్టుకుని ఉంటారు. లేకుంటే అధికారం ఉన్న పార్టీలోకి జంప్ అవుతారు. ఇందుకు ఎవరు కూడా మినహాయింపు కాదు. రాష్ట్రం ఏదైనా, పార్టీ ఏదైనా అధికారం ఉంటే అదే తమ పార్టీ అన్న ధోరణిలో నేతలు ఉన్నారు. ఇది రాజకీయ పార్టీల పతనానికి దారితీస్తోంది. ప్రజల సమస్యలపై పోరాడే అవకాశం లేకుండా చేస్తోంది. రాజకీయనేతలు నిబద్ధత కోల్పోతే ఎక్కువ కాలం నేతలుగా మనలేమని గుర్తిస్తే మంచిది. తెలంగాణలో ఓ పదిమంది విపక్ష బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరిపై చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ కోర్టుల చుట్టూ తిరుగుతోంది. చివరకు సుప్రీంకోర్టు బాల్‌ను స్పీకర్ కోర్టులో వేసింది. పార్టీ వీడిని వారికి స్పీకర్ నోటీసులు ఇచ్చి, విచారణ చేశారు. తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని అంటున్నారు. ఎపిలోనూ జగన్‌కు వీరవవిధేయులుగా ఉన్నవారు టిడిపి, జనసేనల్లో చేరుతున్నారు. వీరు కూడా సిద్ధాంతాలు, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రధానంగా తెర మీదకు తీసుకుని వస్తున్నారు. నిజానికి ఫిరాయింపుల చట్టం పకడ్బందీగా లేకపోవడం, దానిని అమలు చేయాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో లేకపోవడం వల్ల ఇష్టం వచ్చినట్లుగా పార్టీ ఫిరాయింపులు సాగుతున్నాయి. ఇందుకు అన్ని పార్టీలది ఒకటే సిద్ధాంతం. దీనికి ఎక్కడో ఒకచోట తెరపడాలి. పార్టీ ఫిరాయింపులు, అవకాశవాద రాజకీయాలపై ప్రజలు నిలదీయడం అలవాటు చేసుకోవాలి.

# మరోమారు ట్రంప్ సుంకాల బాదుడు

- ఫార్మా ఉత్పత్తులపై వందశాతం ట్యాక్స్
- భారతీయ ఔషధ పరిశ్రమలు లక్ష్యంగా సుంకాలు



**వాషింగ్టన్, సెప్టెంబర్ 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకుపడ్డారు. ఫార్మా దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తూ బాంబు పేల్చారు. బ్రాండెడ్, పేటెంట్ ఉన్న ఔషధ ఉత్పత్తుల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. అమెరికాలో ప్లాంట్‌లను నిర్మిస్తున్న విదేశీ ఔషధ తయారీ సంస్థలకు ఈ సుంకాలు వర్తించవని పేర్కొన్నారు. అదేవిధంగా అప్‌హోస్టర్డ్ ఫర్నిచర్‌పై 30 శాతం, భారీ ట్రక్కులపై 25 శాతం దిగుమతి సుంకాలు విధించనున్నట్లు వెల్లడించారు. అలాగే కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ వానిటీలపై 50 శాతం టారీఫ్‌లు విధిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి తీసుకొస్తామన్నారు. జాతీయ భద్రతతో పాటు ఇతర కారణాలను పరిగణనలోకి తీసుకుని ఈ టారిఫ్‌లు విధిస్తున్నట్లు- తన సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్ ద్వారా ట్రంప్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు తీసుకున్న ఈ నిర్ణయంతో భారతీయ ఫార్మా పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. భారత ఫార్మా కంపెనీలకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ మొత్తంగా 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసింది. ఇందులో 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు అమెరికాకే ఎగుమతి అయ్యాయి. అంటే మొత్తం ఎగుతుల్లో ఇది 31 శాతం. ఇక అగ్రరాజ్యంలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45 శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15 శాతం మన దేశం నుంచి సరఫరా చేసినవే కావడం గమనార్హం.

# ఒక్కో మహిళా ఖాతాలో పది వేలు

- బీహార్‌లో ఎన్నికల తాయిలం
- మహిళా రోజ్‌గార్‌కు ప్రధాని మోడీ ప్రారంభం





**న్యూఢిల్లీ/పాట్నా, సెప్టెంబర్ 26:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది. ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభించడం ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. దిల్లీలో ఉన్న మోదీ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఇతర మంత్రులు హాజరయ్యారు. రూ.7,500 కోట్లతో బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకు వచ్చింది. మహిళా సాధికారత, స్వయంఉపాధి కల్పించడం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు ఈ స్కీమ్ కింద రూ.10వేలు నేరుగా అందాయి. తర్వాత వివిధ దశల్లో ఆ సహాయం రూ.2 లక్షల వరకు ఉండనుంది. స్వయంఉపాధి కోసం పశుపోషణ, వ్యవసాయం, -టైలరింగ్ వంటి రంగాల్లో ఆ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది.. ఈ కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ఈ నవరాత్రి సందర్భంగా బిహార్ మహిళల సంతోషంలో నేనూ భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ నాకు స్క్రీన్‌పై లక్షలాదిమంది మహిళలు కనిపిస్తున్నారు. వారి ఆశీర్వాదాలు మాకు గొప్ప బలం అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ మీకోసం పని చేస్తున్నారు. గత ప్రభుత్వం అలా కాదు. లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ... సీఎం పదవిని కోల్పోయినప్పుడు.. తన సతీమణిని ముఖ్యమంత్రిని చేశారు. తన కుటుంబం గురించి మాత్రమే ఆందోళన చెందారు. మేం మాత్రం బిహార్ ప్రజలందరి కోసం పనిచేస్తామని విపక్ష ఆర్జేడీపై నీతీశ్‌కుమార్ విమర్శలు చేశారు.

# తిరుమల లడ్డూ కేసు





**చిన్నప్పన్నను ఇంటరాగేషన్‌లో వేధిస్తే ఫిర్యాదు చేయొచ్చు కదా" అంటూ సీజేఐ కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:** తిరుమల లడ్డూ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి కీలక వ్యాఖ్యలు వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డూ కేసులో సీబీఐ పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. తిరుమల లడ్డు కేసులో సిట్ పనిచేయడం ఆపేసిందా? అంటూ సీజేఐ ప్రశ్నించారు. "సిట్ వేరొక అధికారికి అధికారాలు బదలాయించకూడదా? చిన్నప్పన్నను ఇంటరాగేషన్‌లో వేధిస్తే ఫిర్యాదు చేయొచ్చు కదా" అంటూ సీజేఐ వ్యాఖ్యానించారు. చిన్నప్పన్నకు సిట్‌లో లేని అధికారి నోటీసు ఇవ్వడం సుప్రీంకోర్టు ఆదేశాలను అతిక్రమించడమేనని ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ సవాల్ చేసింది. జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం.. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించింది. ఏపీ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# అమెరికా ప్రసంగం వివాదం

## హైకోర్టులో రాహుల్ గాంధీకి చుక్కెదురు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అలహాబాద్ హైకోర్టులో చుక్కెదురైంది. తన వ్యాఖ్యలపై దర్యాప్తునకు వారణాసి ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో రాహుల్ వ్యాఖ్యలపై విచారణకు మార్గం సుగమమైంది. గతేడాది అమెరికా పర్యటనలో ఓ వర్గాన్ని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై వారణాసి ప్రత్యేక కోర్టు రివిజన్ పిటిషన్‌ను స్వీకరించింది. దీనిని సవాలు చేస్తూ రాహుల్ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం దానిని తోసిపుచ్చింది. అమెరికా పర్యటనలో భాగంగా గతేడాది వర్జీనియాలో భారతీయ సంతతి ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. కొన్ని వర్గాలు, భాషలు, మతాలను ఆర్‌ఎస్‌ఎస్ అభద్రతా భావానికి గురిచేస్తోందని ఆరోపించారు. ఇలా భారత్‌లో మత స్వేచ్ఛపైనే పోరాటం జరుగుతోందని, రాజకీయాల గురించి కాదన్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ముందు కూర్చొన్న వారిలో తలపాగాతో ఉన్న వ్యక్తిని ఉద్దేశిస్తూ- సిక్కులు తలపాగాలు, కడియాలు ధరించవచ్చా? వారు గురుద్వారాకు వెళ్లగలుగుతున్నారా? అనే వాటిపైనే భారత్‌లో ఘర్షణలు జరుగుతున్నాయన్నారు. అన్ని మతాలకూ ఇదే పరిస్థితి తప్పడం లేదన్నారు. ఈ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా తప్పుపట్టింది.

# బసరత్ ఖాన్ ఇళ్లల్లో ముగిసిన ఈడీ సోదాలు

## సోదాను స్వాగతించిన బండి సంజయ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 26:** నగరంలో లగ్జరీ కార్ల విక్రయాల డీలర్ బసరత్ ఖాన్ ఇల్లు, కార్యాలయంతో పాటు అతని స్నేహితుల ఇళ్లలో ఈడీ సోదాలు ముగిశాయి. దాదాపు 6 గంటలకు పైగా అధికారులు సోదాలు నిర్వహించారు. ఫెమా ఉల్లంఘన కేసులో బసరత్ ఖాన్‌ను ఇప్పటికే అహ్మదాబాద్ ఈడీ అధికారులు అరెస్టు చేశారు. రాజకీయ నాయకులు, వ్యాపారులకు ఆయన లగ్జరీ కార్లు అమ్మినట్టు ఈడీ గుర్తించింది. విదేశాల నుంచి తెచ్చిన కార్లకు పన్ను ఎగవేత ఆరోపణలతో ఈడీ సోదాలు చేపట్టింది. బసరత్ ఖాన్ ఎవరికి కార్లు విక్రయించారనే దానిపై కూడా ఈడీ అధికారులు ఆరా తీశారు. రూ.కోట్ల మేర కస్టమ్స్ మోసం కేసులో గతంలోనూ బసరత్ ఖాన్ అరెస్టయ్యారు. అక్రమ కార్ల దిగుమతులపై ఈడీ దర్యాప్తును స్వాగతిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. దేశ ఖజానాకు నష్టం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విక్రేతలతోపాటు కొనుగోలుదారుల పై విచారణ జరపాలన్నారు.

# లద్దాఖ్‌లో అల్లర్ల ప్రమేయం

## పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టు



**లేహ్, సెప్టెంబర్ 26:** లద్దాఖ్‌లో చోటు చేసుకున్న అల్లర్లకు కారకుడిగా భావిస్తున్న పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం వాంగ్‌చుక్ ప్రకటనలతోనే లేహ్‌లో హింసాత్మక ఘటనలు జరిగాయని కేంద్రం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనల్లో నలుగురు మృతి చెందగా, సుమారు 90 మందికిపైగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే అతడిని పోలీసులు అరెస్టు చేశారు. లద్దాఖ్‌లో కొంతకాలంగా రాష్ట్ర హోదా కోసం జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలనను అక్కడి ప్రజలు మూడేళ్లుగా నిరసిస్తున్నారు. తమ భూమి, సంస్కృతి, వనరుల పరిరక్షణ కోసం రాజ్యాంగ భద్రత ఉండాలని కోరుతున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర హోదా కోసం పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ రెండువారాలుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్ కింద చేర్చాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో కొద్ది రోజులుగా ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. దీంతో ఈ పరిస్థితికి వాంగ్‌చుక్ రెచ్చగొట్టే వ్యాఖ్యలే కారణమని హోంమంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. అసలు సమస్యను పక్కనపెట్టిన తనను బలిపశువును చేశారని సోనమ్ వాంగ్ చుక్ ఆరోపించారు. ఇది ఎంతమాత్రం తెలివైన నిర్ణయం కాదన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేయడం గమనార్హం.

# గుజరాత్ తర్వాత మనమే



**అమరావతి :** ప్రపంచంలో నాణ్యమైన లాజిస్టిక్స్ ఏపీకి వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. లాజిస్టిక్స్‌లో ప్రస్తుతం 3లక్షల మంది పనిచేస్తున్నారు. ఆ రంగంలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తాం అని వివరించారు.లాజిస్టిక్స్, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాల అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. వైకాపా పాలనలో పరిశ్రమల యజమానులను బెదిరించి పంపించేశారు. దాంతో పెట్టుబడి దారులకు మన రాష్ట్రంపై నమ్మకం పోయింది. వైకాపా హయాంలో రాష్ట్రం ఇమేజ్‌ను బాగా దెబ్బతీశారు. పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించేందుకు అనేక చర్యలు చేపట్టాం. అన్ని రకాలుగా అండగా ఉ ంటామని పెట్టుబడి దారులకు నమ్మకం కల్పించాం. త్వరలోనే విశాఖ ఐటీ హబ్‌గా మారుతుంది. విశాఖకు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సంచర్ వస్తున్నాయి. 2026 ఆగస్టు నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. డిమాండ్ మేరకు టెర్మినళ్లు, రన్‌వేలు విస్తరిస్తాం. దసరా ఉత్సవాల్లో కోల్‌కతా, మైసూర్ సరసన విజయవాడను చేర్చాం అని చంద్రబాబు వివరించారు. వస్తు రవాణా, ప్రయాణికుల రవాణా లాంటి మాధ్యమాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారి మార్గాలు, రైల్వే ఇలా వేర్వేరు రంగాలను విస్తృతం చేయాలని సూచించారు. భారత్‌లో లాజిస్టిక్స్ వ్యయం రూ.24.01 లక్షల కోట్లుగా ఉందని చెప్పుకొచ్చారు. జీడీపీలో లాజిస్టిక్స్ వాటా 7.97 శాతంగా ఉందని వివరించారు. రవాణా రంగంలో రోడ్ల ద్వారా జరిగే రవాణా 41 శాతం మేర వాటా కలిగి ఉందని తెలిపారు. లాజిస్టిక్స్‌కు అయ్యే వ్యయాన్ని తగ్గించగలిగితే ఉత్పత్తి వ్యయమూ తగ్గుతుందని వెల్లడించారు. ఇది ఉ త్పత్తిదారులు, వినియోగదారులతో పాటు అందరికీ ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ఎకో సిస్టమ్‌లో రైలు, రోడ్డు, జల రవాణాతోపాటు- పైప్‌లైన్ మార్గం కూడా కీలకంగా మారిందని చెప్పుకొచ్చారు. పైప్‌లైన్ ద్వారా గ్యాస్, నీరు, స్లర్రీ లాంటివి రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని వెల్లడించారు. మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ ద్వారా హైయ్యర్ కార్గో రవాణా చేస్తే వ్యయం తక్కువ అవుతుందని వివరించారు. ఏపీకి ప్రస్తుతం డ్రై పోర్టుల ప్రాజెక్టులు పెద్దఎత్తున వస్తున్నాయని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ ఎకో సిస్టమ్ లో మౌలిక సదుపాయాలే ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఉద్ఘాటించారు. దీని కోసం ఓ బ్లూ ప్రింట్ తయారు చేసి వ్యయం తగ్గించటమే లక్ష్యంగా పనిచేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. భారతదేశ లాజిస్టిక్స్ కాస్ట్ రూ.24 లక్షల కోట్లు-. పాత్ హోల్స్ ఫ్రీ రోడ్లు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేశాం. ఇంకా చాలా చేయాల్సి ఉంది. డబ్బులు ఎంతైనా ఫర్వాలేదు.. అయితే పాత్ హోల్ ఉ ంటే వదిలిపెట్టనని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని ఆదేశించాను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బ్లాక్ సాయిల్ అవ్వడంతో వెంటనే రోడ్లు దెబ్బతింటున్నాయి. రాయలసీమలో ఆ ఇబ్బంది ఉండదు. మొదట్లో గుంతల మూలంగా కోల్‌కత్తా నుంచి చెన్నైకి వెళ్లాలంటే నాలుగైదు రోజులు పట్టేది. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయితో మాట్లాడి స్వర్ణ చతుర్భుజికి శ్రీకారం చుట్టాం. రోడ్లు నాగరికతకు చిహ్నం. 4,739 కిలోమీటర్లు జాతీయ రహదారులు ఏపీలో ఉన్నాయి. వెయ్యి స్కేర్ కిలోమీటర్లకు 53 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉన్నాయి. ఇప్పుడున్నవి కాకుండా రెండు లైన్లు, నాలుగు రైల్వే లైన్లు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. అలాగే హైస్పీడ్ రైల్వే కారిడార్‌కూ కేంద్రం అంగీకరించింది' అని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. హైదరాబాద్- బెంగళూరు కారిడార్, హైదరాబాద్- చెన్నై కారిడార్ నాలుగు లైన్ల రైల్వే లైన్లు రాబోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశాఖపట్నంలో రైల్వేజోన్‌ను ఏర్పాటు- చేశాం. ఆంధ్రప్రదేశ్ నుంచి హైస్పీడ్ రైళ్లు కూడా వెళ్లనున్నాయి. 1053 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఏపీకి ఉంది. గుజరాత్ తర్వాత 320 మిలియన్ టన్నుల కెపాసిటీ-తో మనం హ్యాండిల్ చేయొచ్చు. అయితే 12 మిలియన్ టన్నులను మాత్రమే.. ఇప్పుడు హ్యాండిల్ చేయగలిగే రెండో స్థానంలో ఏపీ ఉంది. రామాయపట్నం ఏప్రిల్ 26వ తేదీకి, మచిలీపట్నం డిసెంబర్ 26వ తేదీకి పూర్తిచేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నాం. ఫిషింగ్ హార్బర్‌లు అన్ని పూర్తయితే మత్స్యకారులకు ఉపాధి లభిస్తోందన్నారు. అమరావతి నుంచి కృష్ణా నదిలో ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ కనెక్ట్ చేశాం. ఏపీలో ఆరు ఎయిర్‌పోర్టుల ఆపరేషన్ జరుగుతున్నాయి.. ఇంకొక్కటి విశాఖపట్నం ఎయిర్ పోర్టు నడుస్తోంది. విశాఖపట్నంలో రానున్న ఆగస్టు కల్లా మరో ఎయిర్ పోర్టు ఆపరేషన్‌కు వస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్యాసింజర్ ట్రాఫిక్ పెరిగిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక భూములు, ట్రాఫిక్ పరిస్థితులు చూసి రోడ్లు వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. హైవేల విషయంలో దేశంలో రెండో స్థానంలో ఉన్నాం. హైవేల్లో రూ.లక్షన్నర కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. రైల్వే డబుల్ లైన్లను నాలుగు వరుసలుగా మార్చే అవకాశముంది. రైల్వేలో హైదరాబాద్- బెంగళూరు, హైదరాబాద్- చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్లపై చర్చలు జరుగు తున్నాయి. మన రాష్ట్రంలో రైల్వేలో 145 రకాల పనులు జరుగుతున్నాయి. మేం వచ్చిన వెంటనే విశాఖ రైల్వే జోన్ ప్రారంభించాం. దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ అంశాలపై దృష్టి సారించాం. నియోజకవర్గాల్లో జరిగే అభివృద్ధిపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలి. లాజిస్టిక్స్‌పై రూ.2.5లక్షల కోట్లు- ఖర్చు పెట్టే అవకాశం ఉంది. కియా కోసం 8 నెలల్లో రిజర్వాయర్ పూర్తి చేసి నీరు ఇచ్చాం. పక్క రాష్ట్రాలకు వెళ్తామన్న అనేక కంపెనీలను ఏపీకి తెచ్చాం. సత్సంబంధాలు ఉంటేనే పరిశ్రమలు వస్తాయి.. బెదిరిస్తే రావు. పరిశ్రమలను ఇక్కడికి తెచ్చేందుకు అనేక కష్టాలు పడ్డాం అని అన్నారు..

## అనంత వర్సిటీలో అక్రమాలపై కమిటీ

మొదటి పేజీ తరువాయి



రిక్రూట్‌మెంట్‌లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంపై కమిటీ వేస్తామన్నారు. వంద రోజుల్లో నివేదిక తెప్పించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు ఎంఎస్ రాజు, పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ... పారదర్శకంగా విశ్వవిద్యాలయాలు నడిపించాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఉందని తెలిపారు. గురువారం ఆంధ్రా యూనివర్సిటీలో ఒక విద్యార్థి ఫిట్స్‌తో చనిపోయారని.. దీనిపై కొన్ని విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడం సరికాదన్నారు. ప్రభుత్వపరంగా ఎలాంటి తప్పు లేకపోయినా రాజకీయాలు చేయడం సరికాదని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా యూనివర్సిటీ వీసీలను నియమిస్తున్నట్లు- తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీని టాప్ - 100 వర్సిటీల్లో ఒకటిగా తీర్చిదిద్దే బాధ్యతను ముఖ్యమంత్రి తనకు అప్పగించారని పేర్కొన్నారు. కొంతమంది వారి స్వార్థం కోసం కావాలని విశ్వవిద్యాలయాల్లో గొడవలు సృష్టించడం బాధాకరమన్నారు.రాష్ట్రంలో భవనాలు లేని పాలిటెక్నిక్ కళాశాలలకు నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు- మంత్రి నారా లోకేశ్ శాసనసభలో తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు కళాశాలల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. చోడవరం, పొన్నూరు, బేతంచర్ల, మైదుకూరు, గుంతకల్లు కాలేజీలకు భూములు కేటాయించామని.. మచిలీపట్నం, కేఆర్ పురం, అనపర్తిలో త్వరలో కేటాయిస్తామని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎంపీ లాడ్స్, సీఎస్ఆర్ నిధులను అనుసంధానించి సొంత భవనాల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు 70శాతంగా ఉన్నాయన్నారు. కన్వెన్షనల్ కోర్సులకు ఎవరూ రావడం లేదని..వాటిని రీడిజైన్ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## బాలకృష్ణ వ్యాఖ్యలు వినటానికే సిగ్గు పడుతున్నాం

### మండలిలో విపక్షనేత బొత్స



**అమరావతి :** అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలు వినటానికి సిగ్గుపడుతున్నాం అని మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. బాలయ్య అసెంబ్లీలో మామూలుగా ఉన్నాడా? అని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్, చిత్ర పరిశ్రమలో ముఖ్య హీరో చిరంజీవిని అవమానించడం సరికాదని మండిపడ్డారు. మండలి చైర్‌లో ఒక దళితుడు కూర్చున్నాడని అవమానించాలని చూస్తున్నారన్నారు. రాజ్యాంగంలో ప్రతీ ఒక్కరికీ ప్రతిపాదించిన హక్కులు కాపాడాలని, కానీ చట్టసభల్లో ఇలా జరగటం దురదృష్టకరం అని మండలి విపక్షనేత బొత్స పేర్కొన్నారు. సభలో నారా లోకేష్ మమ్మల్ని ఎవరేం పీకుతారు అన్నారు. వాళ్ళ వ్యవహారశైలి అలాగే ఉంది. మాజీ ముఖ్యమంత్రి అన్నా గౌరవం లేదు, సినీ పరిశ్రమకు చెందిన మాజీ కేంద్ర మంత్రి అన్న గౌరవం లేదు. బాలకృష్ణ పెద్ద పూడింగి అనుకుంటున్నారు. ఏం చూసి మీ అహంభావం. వాళ్ళ పార్టీ నుంచి ఇంతవరకు వివరణ లేదు. స్పీకర్ చాలా పెద్ద మాటలు మాట్లాడుతాడు.. ఎందుకు స్పందించలేదు. ఒక మాజీ సీఎం, చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తిని అవమానిస్తే పట్టించుకోరా?. మేం కేవలం సభా సంప్రదాయాల గురించి మాట్లాడుతున్నాం. చిరంజీవికి అవమానిస్తే జనసేన ఎందుకు స్పందించలేదనేది మాకు అనవసరం, వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం అని బొత్స అన్నారు. మండలి సభ్యులకు రాజ్యాంగ పరంగా వచ్చే హక్కులు ఇవ్వటం లేదు. మండలి చైర్మన్ కు కూడా ప్రోటోకాల్ కూడా ఇవ్వటం లేదు. మండలిలో ఇదే అంశంపై ప్రశ్నిస్తే సమాధానం లేదు. తిరుపతిలో జరిగిన మహిళా సదస్సుకు లోక్ సభ స్పీకర్ వచ్చారు. ఆ కార్యక్రమానికి స్పీకర్, డిప్యూటీ- స్పీకర్, కౌన్సిల్ డిప్యూటీ- స్పీకర్ లకు ఆహ్వానించారు. కనీసం సంప్రదాయం ప్రకారం అయినా గౌరవించాలి. జీవో 59 ప్రకారం మండలి చైర్మన్ ను ఆహ్వానించాలి. ప్రయారిటీ- ఆఫ్ ఆర్డర్ ప్రకారం రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాస్తున్నారు. ఇది జేబు సంస్థ లేక టీ-డీపీ ఆఫీసా. అసెంబ్లీని రాజకీయాలకు వాడుకోవటాన్ని ఖండిస్తున్నాం. సభ్యులకు పెట్టిన క్రీడా పోటీ-ల్లో కూడా చైర్మన్ ను గౌరవించలేదు. దీనికి ఎవరు బాధ్యులు అని సీఎం సమాధానం చెప్పాలి. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. దేవాలయం లాంటి ప్రాంగణాన్ని కాపాడుకోవాలి. ప్రభుత్వం సమాధానం చెప్పే వరకు నిరసనలు కొనసాగుతాయని బొత్సహెచ్చరించారు.

## కూటమి ప్రభుత్వంలో 15 నెలల్లో 4.71 లక్షల ఉద్యోగాలు

**అమరావతి :** రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదు- పాయాల కల్పన, ఉపాధి అవకాశాలపై శాసనసభలో ఏపీ సీఎం చంద్రబాబు ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 15 నెలల కాలంలోనే రాష్ట్రంలోని వివిధ రంగాల్లో మొత్తం 4,71,574 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది ఉ పాధ్యాయులను, ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో 9,093 మందిని, పోలీస్ విభాగంలో 6,100 మందిని నియమించినట్లు తెలిపారు. వీటితో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, జాబ్ మేళాల ద్వారా 92,149 మందికి, వర్క్ ఫ్రం హోం అవకాశాల ద్వారా మరో 5,500 మందికి ఉపాధి లభించిందన్నారు. ప్రైవేట్ రంగంలో పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల ద్వారా అత్యధికంగా 3,48,891 మందికి ఉ ద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. ఎవరు, ఎక్కడ, ఏ రంగంలో ఉద్యోగం పొందారనే పూర్తి వివరాలతో త్వరలోనే ఒక పోర్టల్ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తొలి తరం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

### మౌలిక వసతుల్లో దూకుడు

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనే కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. హైవేల నిర్మాణంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో రూ.1.5 లక్షల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని తెలిపారు. స్థానిక అవసరాలు, ట్రాఫిక్ పరిస్థితులను బట్టి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రైల్వే రంగంలో రాష్ట్రంలో 145 రకాల పనులు పురోగతిలో ఉన్నాయని, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ల ఏర్పాటుపై చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖపట్నం రైల్వే జోన్‌ను ప్రారంభించి, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించామని గుర్తుచేశారు.

## వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

మొదటి పేజీ తరువాయి

తొమ్మిది రోజులు జరిపించే ఉత్సవాలు కాబట్టి ఇవి 'బ్రహ్మోత్సవాలు' అని కూడా అంటారు. తిరుమలలో జరిగే మిగిలిన ఉత్సవాలతో పోలిస్తే, ఇవి చాలా పెద్దయెత్తున జరిగేవి కాబట్టి వీటిని 'బ్రహ్మోత్సవాలు' అంటారనీ ఇంకొందరి భావన. ఈ ఉత్సవాలన్నీ పరబ్రహ్మస్వరూపుడైన శ్రీవారికి చేసే గొప్ప ఉత్సవాలు కాబట్టి వీటిని 'బ్రహ్మోత్సవాలు' అంటున్నారని మరికొందరి భావన. బ్రహ్మోత్సవాలు తొలిరోజున జరిగే 'ధ్వజారోహణం'తో మొదలవుతాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం స్వామివారికి సుప్రభాత, తోమాలసేవలు జరిగాక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామికి ఏకాంతంగా తిరుమంజన ప్రక్రియ చేసి, నైవేద్యం సమర్పిస్తారు. ఆలయసన్నిధిలోని ధ్వజస్తంభంమీద పతాకావిష్కరణ చేస్తారు. స్వామివారి వాహనం గరుడుడు కాబట్టి, ఒక కొత్త వస్త్రంమీద గరుడుడి బొమ్మ చిత్రీకరించి సిద్ధంగా ఉంచుతారు. దీన్ని 'గరుడధ్వజపటం' అంటారు. దీన్ని ధ్వజస్తంభంమీద కట్టేందుకు నూలుతో చేసిన కొడితాడును సిద్ధం చేస్తారు. గరుడధ్వజపటాన్ని ఊరేగించి, ధ్వజస్తంభం వద్దకు తెచ్చి, ఉత్సవ మూర్తులైన భోగ శ్రీనివాసుడు, శ్రీదేవి, భూదేవిల సమక్షంలో- గోధూళి లగ్నమైన మీనలగ్నంలో కొడితాడుకు కట్టి పైకి చేరుస్తారు.

ధ్వజస్తంభం మీద ఎగిరే గరుడ పతాకమే- సకల దేవతలకు స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రం. అష్టదిక్పాలకులు, భూత, ప్రేత, యక్ష, రాక్షస, గంధర్వగణాలకూ ఇదే ఆహ్వానం. ఈ ఆహ్వానం అంది విచ్చేసిన దేవ, రాక్షసగణాలకు, వారివారి నిర్ణీత స్థలాలను కేటాయించి, పద్ధతి ప్రకారం, వారి నియమాల ప్రకారం నైవేద్యం రూపంలో బలిని సమర్పిస్తారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయి. ధ్వజారోహణం తర్వాత, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామిని పుష్పమాలాలంకృతుల్ని చేసి, వాహన మంటపంలో ఉన్న పెద్ద శేష వాహనంపై ఊరేగిస్తారు. అనంతరం ఉత్సవమూర్తులను రంగనాయక మంటపంలో విశ్రమింపజేస్తారు. స్వామి శేషతల్పశాయి. ఆయన కొలువున్న కొండ- శేషాద్రి. అందుకే ఏడు తలలున్న పెద్ద శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు బ్రహ్మోత్సవాలలో అతి ప్రధానమైనదిగా పరిగణిస్తారు. మొదట్లో ఈ పెద్ద శేషవాహనాన్ని తొమ్మిదోరోజు ఉదయంపూటనే ఊరేగింపునకు వినియోగించేవారు. పెద్ద శేషవాహనాన్ని ఆదిశేషుడికి ప్రతీకగా భావిస్తే, చిన్న శేషవాహనాన్ని 'వాసుకి'కి ప్రతీకగా పరిగణించటం కద్దు. రోజూ సాయంత్రం వేళలో స్వామివారిని హంస వాహనంమీద వూరేగిస్తారు. ఈ హంసవాహనం మీద స్వామి, విద్యాలక్ష్మిగా వూరేగటం విశేషం. మూడోరోజు ఉదయం శ్రీవారికి సింహ వాహనసేవ జరుగుతుంది. ఆ సమయంలో స్వామివారు వజ్రఖచిత కిరీటంతో, సకల ఆభరణాలతో అలంకృతమయి ఉంటారు. జంతుజాలానికి రాజైన సింహాన్ని మృగత్వానికి ప్రతీకగా భావిస్తారు. ప్రతిమనిషి తనలోని మృగత్వాన్ని సంపూర్ణంగా అణచి ఉంచాలనీ తలపైన ఆదిదేవుడిని ధరించాలనీ చెప్పే ప్రతీకగా ఈ సింహవాహనంపై స్వామివారు ఊరేగుతారని భక్తులు భావిస్తారు. ఆరోజు రాత్రి స్వామివారు తన ఉభయ దేవేరులతో కలిసి, అచ్చమైన భోగశ్రీనివాసునిగా ముత్యాలపందిరి వాహనంపై తిరువీధులలో ఊరేగుతారు. నాలుగోరోజు ఉదయం, స్వామివారు తన కల్పవృక్ష వాహనంలో భక్తులకు దర్శనం ఇస్తారు. కామితార్థ ప్రదాయినిగా కల్పవృక్షానికి మన పురాణ, ఇతిహాసాలలో ఓ విశిష్ట స్థానం ఉంది. ఆ కల్పవృక్షాన్ని సైతం తన వాహనం చేసుకోగలిగిన శ్రీవారు భక్తుల కొంగు బంగారమన్నది వేరుగా చెప్పేదేముంది! ఆరోజు సాయంత్రం, సర్వభూపాల వాహనంమీద స్వామివారి వూరేగింపు, భక్తులకు కనులవిందుగా సాగుతుంది. బ్రహ్మోత్సవాలలో అయిదోరోజున, స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ అవతార వూరేగింపు విధానానికి ఓ ప్రత్యేకత ఉంది. మిగిలిన అన్ని వాహనసేవలూ స్వామివారి ఆలయంలోని వాహన మండపంలో ఆరంభమైతే, మోహినీ అవతార వూరేగింపు శ్రీవారి ఆలయంనుంచే పల్లకీపై ఆరంభమవుతుంది. మోహినీ అవతారంలో ఉన్న స్వామి వజ్రాలు, రత్నాలు పొదిగిన హారాన్ని ధరించి, తన కుడిచేతితో చిలుకను పట్టుకొని ఉంటారు. ఈ హారాన్నీ, చిలుకనూ స్వామివారి భక్తురాలైన శ్రీవిల్లి పుత్తూరు ఆండాళ్ (గోదాదేవి) నుంచి తెచ్చినట్లుగా చెప్తారు. స్వామివారి ప్రధాన వాహనం గరుడుడు. అయిదోరోజు రాత్రి జరిగే ఈ సేవకు ఒక ప్రత్యేకత ఉంది. ఏడాదిలో అన్నిరోజులూ ధ్రువబేరానికి అలంకరించే మకరకంఠి, లక్ష్మీహారం, సహస్రనామ మాలలను గరుడవాహన సేవ రోజున మాత్రం ఉత్సవమూర్తి మలయప్పస్వామికి అలంకరింపజేస్తారు. అలాగే ఈరోజునే, శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న బేడీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి రాష్ట్ర ప్రజల తరఫున ముఖ్యమంత్రి సమర్పించే నూతన వస్త్రాలను స్వామివారు స్వీకరిస్తారు. గరుడ వాహనసేవలో స్వామి సరసన దేవేరులు ఉండరు. ఆరోజు ఉదయం, హనుమద్వాహనసేవ జరుగుతుంది. హనుమంతుడు, శ్రీరాముని నమ్మినబంటు. త్రేతాయుగంలో తనకు అపార సేవలందించిన ఆ భక్తుడిని తాను మర్చిపోలే దంటూ, ఆ బంటుకు మళ్ళీ తన సేవాభాగ్యం కలిగించే



దివ్య దృశ్యం ఇది. తాను సైతం ఆ మహావిష్ణువు స్వరూపమేనని భక్తులకు స్వామి తెలియజేసే మధుర సన్నివేశమది. ఆరో రోజు రాత్రివేళలో- స్వామివారు గజ వాహనం మీద తిరువీధులలో మెరిసి భక్తులను మురిపిస్తారు. శ్రీమద్భాగవతంలోని గజేంద్రమోక్ష ఘట్టాన్ని తలపింపజేస్తూ సాగే వూరేగింపు ఇది. ఆపదలో ఉన్న భక్తులను ఆదుకోవటానికి తానెప్పుడూ సిద్ధమేననీ అలనాడు 'సిరికింజెప్పక, శంఖుచక్ర యుగమున్ చేదోయి సంధింపక' వచ్చినా, నేడు భక్తజనుల మొరల్ని వినేందుకు సర్వాలంకారభూషితుడనై వస్తున్నాననీ విశదపరిచే ఘట్టం- ఏడోరోజు ఉదయం- మలయప్పస్వామి సూర్యప్రభ వాహనంలో ఊరేగుతారు.అదేరోజు సాయంత్రం చందప్రభ వాహనంమీద స్వామి రావటంతో, దివారాత్రాలకు తానే అధినేతనని ప్రకటించినట్లు భక్తులు భావిస్తారు. చందప్రభ వాహనంమీద వచ్చే స్వామి, చందప్రభలకు ప్రతీకలైన తెలుపు వస్త్రాలు, తెల్లని పుష్పాలు, మాలలు ధరించటం విశేషం.ఎనిమిదోరోజు జరిగే రథోత్సవానికి హాజరయ్యేంత భక్తజనం మరేరోజునా కానరారు. భక్తులు ప్రత్యక్షంగా పాలుపంచుకోగలిగే స్వామివారి వాహన సేవ అదే మరి. ఇక రథం విషయానికొస్తే... దానికి సారథి దారుకుడు. సైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వాలహకం రథానికి పూన్చిన గుర్రాలు. సకల దేవతా మూర్తులతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆ రథాన్ని అధిరోహించిన మలయప్పస్వామి తిరు వీధుల్లో ఊరేగి భక్తులను పరవశింపజేస్తారు.బ్రహ్మోత్సవాలలో చివరిరోజైన తొమ్మిదోనాడు, స్వామివారికి చక్రత్తాళ్వార్ రూపంలో చక్రస్నానం చేయిస్తారు. ముందుగా వరాహస్వామి ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవితో సహా అభిషేకసేవలు జరిపిస్తారు. ఆ తర్వాత సుదర్శన చక్రానికి స్వామి పుష్కరిణిలో పుణ్యస్నానం చేయిస్తారు. ఇదే 'చక్రస్నాన ఉత్సవం'. చక్రస్నానం జరిగే సమయంలో స్వామి పుష్కరిణిలో స్నానాలు చేస్తే పాపాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం. చక్రస్నానాలు అయిన తర్వాత ఆరోజు సాయంత్రం శ్రీవారి ఆలయ ధ్వజ స్తంభం మీద ఆరోహణ చేసిన గరుడ పతాకాన్ని అవరోహణం చేస్తారు. ఈ అవరోహణంతో బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన సకల దేవతలకూ వీడ్కోలు పలికినట్లే. బ్రహ్మోత్సవాలు సైతం మంగళపూర్వకంగా పరిసమాప్తి చెందినట్లు లెక్క. మళ్ళీ బ్రహ్మోత్సవాలు సరిగ్గా సంవత్సరం తర్వాతే జరుగుతాయి.

27-09-25 Samayam_Layout 1 9/27/2025 2:42 AM Page 6



# అక్టోబర్ 6 న చౌటుప్పల్ లో వికలాంగులు మరియు చేయూత పెన్షన్ దారుల మహాసభ.

**వరంగల్ సెప్టెంబర్ 26 (సమయం న్యూస్) :** రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచాలి.- సమావేశ ముఖ్య అతిథి ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగవివరణ :- వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు మరియు వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మరియు అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ 4 వేలకు పెంచాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 6 వ తేదీన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నాలుగు మండలాల చేయూత పెన్షన్ దారుల మహాసభను నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథిగా పెన్షన్ దారుల ఆశాజ్యోతి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారు పాల్గొంటారని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ అన్నారు.శుక్రవారం చౌటుప్పల్ పట్టణం లోని మార్కెట్ యార్డ్ హాల్ లో ఎమ్ ఆర్ ఎస్, వి ఎస్ పి ఎస్ , ఎమ్ ఎస్ పి.ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగ స్వామి మాదిగ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ " ఆంధ్రపదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు పెంచి ఇస్తున్నాడు.కానీ తెలంగాణలో రూ 6 వేలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశాడని అన్నారు.2023 ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్ 6 వేలు , మిగితా చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ 4 వేలకు పెంచుతామని రేవంత్ రెడ్డి గారు బహిరంగంగా హామీ ఇచ్చారు. ఈ నెల ఓటు వేయండి , వచ్చే నెల పెరిగే పెన్షన్ తీసుకొండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 20 నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా పెంచలేదని అన్నారు.ఇది ఘోరమైన మోసం అని అన్నారు. ఈ మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్ దారులకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు.కాబట్టే 50 లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన మంద కృష్ణ మాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని అన్నారు.అందులో భాగంగా తెలంగాణ నలుమూల తిరుగుతూ అక్టోబర్ 6వ తేదీన చౌటుప్పల్ కు వస్తున్నారని అన్నారు.చౌటుప్పల్ లో చౌటుప్పల్, రామన్నపేట, పోచంపల్లి, సంస్థాన్ నారాయణపురం మండలాల పెన్షన్ దారుల సభ జరుగుతుంది అని ఈ సభకు నాలుగు మండలాల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల నుండి అన్ని రకాల చేయూత పెన్షన్ దారులు మహాసభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమం లోఎమ్ ఎస్ పి.జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ,ఎమ్ ఆర్ పి ఎస్.పట్టణ అధ్యక్షులు ఎర్ర శంకర్ మాదిగ,ఎమ్ ఆర్ పి ఎస్ మండల ఉపాధ్యక్షులు చీమకండ్ల శ్రీనివాస్ మాదిగ,ఎమ్ ఆర్ పి ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర గౌతమ్ మాదిగ,నల్ల బెల్లి రాజు మాదిగ తదితర నాయకులు పాల్గొన్నారు. నల్ల చంద్ర స్వామి మాదిగ,.ఎమ్ ఎస్ పి జిల్లా అధ్యక్షులు,



## తెలంగాణ వీర వనిత , వీర నారి చాకలి చిట్యాల ఐలమ్మ 130వ జయంతి

**తెలంగాణ వీర వనిత , వీర నారి చాకలి చిట్యాల ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా ప్రజ్ఞాపూర్ లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి మరియు ముట్రాజ్ పల్లి చౌరస్తాలో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**



**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 26 :** ఈ సందర్భంగా వంటేరు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ ఉద్యమంలో ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు, ఈరోజు ఐలమ్మ జయంతి సందర్భంగా వారి ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు. తెలంగాణ మహిళా శక్తికి బహుజన ధీరత్వానికి చిట్యాల ఐలమ్మ ప్రతీకగా నిలిచారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో వారి పోరాటా స్ఫూర్తి ఎందరో తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకమన్నారు, ప్రజా వ్యతిరేక పాలనపై దిక్కరాన్ని ప్రకటించిన చాకలి ఐలమ్మ ప్రతిఘటన తత్వం ఎల్లవేళల ఎందరో నాయకులకు ఉద్యమకారులకు ఆదర్శమని వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు గతంలోని కేసీఆర్ ప్రభుత్వం చాకలి చిట్యాల ఐలమ్మ ప్రత్యేక వేడుకలను అధికారికంగా చేపట్టేదన్నారు, మన తెలంగాణ వీర వనిత చాకలి చిట్యాల ఐలమ్మ అన్నారు, భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను పోరాటా స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన నిప్పు కనిక మన చాకలి చిట్యాల ఐలమ్మ అని అన్నారు, పోరాటంలో చాకలి చిట్యాల ఐలమ్మ చూపిన తెగువ ప్రదర్శించిన ధైర్య సాహసాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయమన్నారు, చాకలి చిట్యాల ఐలమ్మ జయంతి వర్ధంతి కార్యక్రమాలను గతంలోని కేసీఆర్ ప్రభుత్వం అధికారికంగా అమలు చేసిందని తెలిపారు, భావితరాలకు ఆ మహనీయురాలు చరిత్ర పాఠ్యాంశంగా పెట్టి గౌరవించిందని తెలిపారు, గతంలోని కేసీఆర్ ప్రభుత్వం రజక సోదరులకు పెద్దపీట వేసిందన్నారు, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసిందన్నారు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వీర వనిత ఐలమ్మ విగ్రహాలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టించడం జరిగిందన్నారు, నియోజకవర్గంలో కూడా దాదాపు మండల హెడ్ క్వార్టర్లలో కొన్ని గ్రామాలలో చాకలి చిట్యాల ఐలమ్మ విగ్రహాలను పెట్టడం జరిగిందన్నారు, గతంలోని కేసీఆర్ ప్రభుత్వం సబండ వర్గాలకు పెద్దపీట వేసిందన్నారు, వారిని రాజకీయంగా కూడా స్థానం కల్పించిందన్నారు, ఎమ్మెల్సీ లాంటి పదవులతో పాటు రాష్ట్ర కమిషన్లో బోర్డు సభ్యులకు నియమించి రజకులకు అందించాల్సిన అన్ని రకాల హక్కులను కల్పించిన ఘనత కేసీఆర్ అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సీ రాజమౌళి, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య దుర్గాప్రసాద్, మరికంటి కనకయ్య, మల్లేశం, కిషన్ రెడ్డి, బొగ్గుల చందు, హైదర్ పటేల్, వసీం ఖాన్, మన్నె వెంకట్, ప్రజా ప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు రజక సంఘం నియోజకవర్గం అధ్యక్షులు రాచకొండా ఎల్లేష్ రామ్ గారి శ్రీధర్ మెతుకు నరసింహులు మెతుకు సాయిబాబా, తదితరులున్నారు

## చాకలి ఐలమ్మ 130వ జయంతి

- పురస్కరించుకొని వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు,ఆమె ఆశయాలను
- ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్- లింగ్యా నాయక్






**వికారాబాద్, సెప్టెంబర్,26-09(సమయం న్యూస్) :** శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశము హాలు నందు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 130 వ జయంతి ఉత్సవ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్తానిక సమస్తలు )సుదీర్ గార్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ప్రధాన పాత్ర పోషించారని ,తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని కలిగించిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆమె సేవలను కొనియాడారు. వీర నారీ చాకలి ఐలమ్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అధికారికంగా జరపడం సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి , అదనపు కల్లెక్టర్ (ఏ సి ఎల్ బి) సుదీర్ , డి ఆర్ ఓ మంగీ లాల్ ,బి సి సంక్షేమ అధికారి మాధవ రెడ్డి, డి టి డి ఓ కమలాకర్ రెడ్డి , శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి,డిపిఆర్ఓ చెన్నమ్మ, జిల్లా అధికారులు,కల్లెక్టేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు నీటి ప్రవాహాల వద్దకు వెళ్ళరాదు

- కోస్గి సీఐ సైదులు
- జిల్లా ఎస్పి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు




**కోస్గి మండలం, సెప్టెంబర్,26-09(సమయం న్యూస్) :** భారీ వర్షాలు కురుస్తున్నందున నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి సీఐ గురువారం రోజు కోస్గి మండలంలోని ముశ్రిఫా వాగు, ముంగిమల్ల వాగు పొంగిపొర్లుతున్నందున అక్కడి వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కోస్గి సీఐ మాట్లాడుతూ... రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు ఉన్నందున కోస్గి సర్కిల్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు కుంటలు వాగులు పూర్తిస్థాయిలో నిండిఉన్నాయి, బారివర్షాలకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నది కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని రోడ్లపై నుండి నీటి ప్రవాహం ఉధృతంగా ఉంటే అలాంటి కల్వర్టులు, వాగులు దాటవద్దు ప్రమాదాల బారిన పడవద్దు అని కోరారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని లేదా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు కింది సూచనలు పాటించాలని సిఐ గారు తెలిపారు.కరెంట్ స్థంబాలు ముట్టుకోవద్దు, రైతులు వ్యవసాయ బొరుల వద్దకు వెళ్ళవద్దు, చేపలవేటకు వెళ్ళవద్దు, పశువు, మేకలు, గొర్ల మందలు మేతకు పొలాలకు వెళ్ళవద్దు.పాత ఇండ్లలో ఉండవద్దు, ప్రయాణాలు రద్దు చేసుకోవాలి.విద్యార్థులను రవాణా చేసే ఆటో, వ్యాన్ డ్రైవర్లు వాహనాలు నిదానంగా నడపాలి.,గృహ నిర్మాణం పనులు చేసే కూలీలు బయట పైఎత్తు పనులు చేయవద్దు,పట్టణాల్లో కొన్ని ప్రాంతాల్లో కాలనీలకు నీరు చేరి అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి.పిల్లలు సరదాగా ఈత కొట్టడానికి సెల్ఫీ ఫోటోలు దిగడానికి వాగుల వద్దకు వెళ్లరాదని తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపవద్దు అని తెలిపారు.

## 'చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.



**వరంగల్ సెప్టెంబర్ 26. (సమయం న్యూస్) :** చాకలి ఐలమ్మ జయంతి భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల పాలకుర్తి తెగువ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన నిప్పుకణిక మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన వీర వనిత "చాకలి ఐలమ్మ జయంతి" సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించిన మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు .

## చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించిన కమ్మరి శ్రీను



**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 26 :** విముక్తి కోసం దౌర్జన్యాన్ని ఎదిరించిరైతాంగపోరుతో నియంతలను ధిక్కరించిభూస్వామ్య కబంధ హస్తాలనునిర్వీర్యం చేసిన ధీరవనితవెట్టిచాకిరిని భానిసత్వాన్ని వ్యతిరేకించిభూపోరాటంలో గెలిచి శ్రమజీవులఆశలకు వెలుగునిచ్చిన నిప్పురవ్వరజాకార్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసిన వీరనారి చిట్యాల ఐలమ్మ కిఉద్యమాభివందనాలు. అని కమ్మరి శ్రీను తెలియజేశారు తెలంగాణ ఉద్యమంలో చాకలి ఐలమ్మ చేసిన కృషి స్ఫూర్తిదాయకం చాకలి ఐలమ్మ 130 వ జయంతి సందర్భంగా ముట్రాజ్ పల్లి లో విగ్రహావిష్కరణలో పాల్గొని పూలమాలవేసి నివాళులర్పించారుఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కొట్టే స్వామి జిల్లా కౌన్సిల్ మెంబర్ చెప్పాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## "ఈఎంఎస్" అప్లికేషన్ తో గ్రేటర్ వ్యాప్తంగా లీజు చెల్లింపులు ఇక సులభతరం

**హైదరాబాద్, సెప్టెంబర్ 26,( సమయం న్యూస్).:** పురపాలక మార్కెట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, మోడల్ మార్కెట్లు, లీజు భూములు వంటి ఆస్తుల నిర్వహణను మరింత ప్రభావవంతంగా నిర్వహించడానికి జీహెచ్ఎంసీ ఆధునిక డిజిటల్ ప్లాట్ఫార్మ్ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఎస్టేట్ మేనేజ్మెంట్ సిస్టమ్ (ఈఎంఎస్)' పేరుతో రూపొందించిన ఈ యాప్ను సెప్టెంబర్ 24న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు.కమిషనర్ ఆర్.వి. కర్నన్, కమిటీ సభ్యులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈఎంఎస్ ద్వారా లీజుదారులు తమ లీజు చెల్లింపులు, అద్దె మొత్తాలను ఆన్లైన్లోనే సులభంగా చెల్లించవచ్చు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం, వ్యవస్థలో సమర్థత పెరగనుంది. మానవ జోక్యం తగ్గి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందుతాయి. వినియోగదారుల ఫ్రెండ్లీగా రూపొందించిన ఈ యాప్లో డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్ వివరాలు రియల్టైమ్లో కనిపిస్తాయి. ఫీల్డ్ స్థాయి నుంచి హెడ్ ఆఫీస్ వరకు మానిటరింగ్కు ఇది దోహదపడుతుంది.పురపాలక ఆస్తుల నిర్వహణను బలోపేతం చేయడం, ప్రభావంతంగా నిర్వహించడంలో ఈ డిజిటల్ వేదిక కీలకంగా నిలవనుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు.

## ఎడ్ల ను అపహరించిన దుండగులు.



**రాయపోల్,సెప్టెంబర్26:** రాయపోల్ మండలంలోని రాం సాగర్ గ్రామంలో దుండగులు ఎడ్లను అపహరించిన ఘటన బుదవారం రాత్రి చోటుచేసుకుంది. రాసాగర్ గ్రామానికి చెందిన రైతు రాగి గణేష్ రోజు మాదిరిగానే బుదవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద ఎడ్లను కట్టేసి పెట్టి ఇంటికి వచ్చారు. గురువారం ఉదయం తెల్లవారు జామున బావి వద్దకు వెళ్లి చూసే సరికి కొట్టం లో ఎడ్లు లేకపోవడం తో ఆందోళనకు గురయ్యాడు.చుట్టుప్రక్కల వెదికినా దొరుకక పోవడం తో ఎడ్లను రాత్రి వేళ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయినట్లు గ్రహించి,రాయపోల్ పోలీసులకు ఫిర్యాదు చేసారు.సుమారు రూ.1.50 లక్షలు విలువ చేసే ఎడ్లు పోవడం తో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతు కుటుంబానికి ఆర్థికంగా పెద్ద నష్టం వాటిల్లిందని స్థానికులు,గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

# జీ ఇన్స్టిట్యూట్ అఫ్ మీడియా ఆర్ట్స్ స్టూడియో ప్రారంభోత్సవం

● బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్.




**శేరిలింగంపల్లి సెప్టెంబర్26 సమయం న్యూస్. :** సినీ ఇన్స్టిట్యూట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మిత్ర బృందం.కొండాపూర్ లోని మజీద్ బండ మారుతి నగర్ లో జి.కుమార స్వామి డైరెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారంసినీ స్టూడియో లంచనంగా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేస్తూ శుభం లాభం జరగాలని కోరుకున్నారు. కుమార స్వామి పిహెచ్ డి డైరెక్టర్ ఆధ్వర్యంలో సినీ స్టూడియో ప్రారంభోత్సవానికి పెద్దలు అభిమానులు మిత్రబృందం హాజరై అందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. హిందూ ధర్మ ఆచారం ప్రకారం పూజలు చేసి డైరెక్టర్ కుమార్ భగవంతుడి ఆశీర్వాదం తీసుకొని పెద్దలందరి సమక్షంలో జిమా సినీ స్టూడియోను ప్రారంభించారు.సినీ స్టూడియో ప్రారంభోత్సవంలో భాగంగా బేరి రామచందర్ యాదవ్ సినీ స్టూడియో మంచి స్థాయికి ఎదగాలని డైరెక్టర్ ఆధ్వర్యంలో నడుపబడుతున్న సినీ స్టూడియో ప్రారంభం నుండి శుభం జరగాలని లాభసాటిగా ఉండి మంచి పేరు తెచ్చుకునే విధంగా నాణ్యమైన సీరియల్స్ షార్ట్ ఫిలిమ్స్ అన్నీ తీస్తూ పేరు సంపాదించాలని కోరుకోవడం జరిగిందన్నారు.జిమా స్టూడియో జి కుమారస్వామి ఆధ్వర్యంలో కచ్చితంగా ఫాన్ ఇండియా స్థాయిలో ఎదుగుతుందన్నారు. జి.కుమార్ స్వామి కష్టపడి స్వయంకృషితో ఈ స్థాయికి చేరుకున్నారన్నారు. క్రమశిక్షణ గల వ్యక్తి కష్టపడే తత్వం ఉన్న వ్యక్తి తన పక్కన నిలబడ్డ వ్యక్తుల అభివృద్ధి చెందాలని కోరుకునే వ్యక్తి, అన్నింటికి మించి అత్యధిక ప్రతిభగల వ్యక్తి. జిమా స్టూడియోను అత్యధిక రేటింగ్ స్థాయిలో నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.కుమార్ స్వామి గారికి అవార్డులు రివార్డులు కొత్తేమీ కాదని ఆయన అన్నారు.గతంలోనే తన చిత్రాలతో అద్భుత ప్రదర్శన చేసి జాతీయ రాష్ట్ర అవార్డులను సొంతం చేసుకున్నారు అని అన్నారు.ఈ స్టూడియోలో కళారంగంపై ఆసక్తి కల వారికి సినిమా రంగానికి సంబంధించిన అన్ని డైరెక్షన్, స్క్రిప్ట్ రైటింగ్, స్టోరీ నేరేషన్,సినిమా టోగ్రఫీ,ఎడిటింగ్ యాక్టింగ్24 క్రాఫ్ట్ లలో నాణ్యమైన శిక్షణ ఇస్తూ సినిమాలలో అవకాశం కల్పిస్తామన్నారు. సంప్రదించవలసి ననెంబర్. 7780357444తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ తో పాటు హైదరా బాద్ కాంటేస్ట్ ఎమ్మెల్యే గడ్డం శ్రీనివాస్ యాదవ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కె సాయన్నముది రాజు,యూత్ అధ్యక్షులు కుమార్ యాదవ్,గడ్డం తిరుపతి యాదవ్, అభి మానులు మిత్రులు బంధువులు పాల్గొని విజయవంతం చేశారు

# బాన్సువాడ మట్టి బిడ్డపై విమర్శలు చేస్తే సహించేది లేదు.

● ప్రశాంత్ రెడ్డి,బాజీ రెడ్డి ల పై

● విరుచుకుపడ్డ పోచారం అనుచరులు



**కామారెడ్డి, సెప్టెంబర్ 26 (సమయం న్యూస్) :** బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి కోసం తన జీవితం మొత్తాన్ని అంకితం చేసిన బాన్సువాడ ముద్దుబిడ్డ పోచారం శ్రీనివాస్ రెడ్డి పై వలస నాయకులు చేసే విమర్శలు ప్రజలు సహించరని ఆయన అనుచరులు ఘాటుగా హెచ్చరించారు. గురు వినయ్‌కుమార్, ఎరవల కృష్ణారెడ్డి, ఏజజ్ లు మీడియాతో మాట్లాడుతూ – పోచారం పై దుష్ప్రచారం చేస్తే తస్మాత్ జాగ్రత్త అని స్పష్టం చేశారు.

ప్రశాంత్ రెడ్డి పనితీరు పై నిలదీత..ఉమ్మడి నిజాంబాద్ జిల్లాలో మంత్రి హోదాలో ఉన్న ప్రశాంత్ రెడ్డి ఒక్కరోజైనా బాన్సువాడ అభివృద్ధికి చేయూతనిచ్చారా? అని ప్రశ్నించారు. తన ప్రధాన అనుచరుడైన నాటి డిసిసిబి వైస్ చైర్మన్ తో అప్పుడు డిసిసిబి చైర్మన్ గా ఉన్న సొంత పార్టీ పోచారం భాస్కర్ రెడ్డి పై అవిశ్వాసం పెట్టించిన ఘనత కూడా ఆయనదేనని గుర్తు చేశారు.తమ నియోజక వర్గంలో అభివృద్ధి చేయని వారు బాన్సువాడ కు వచ్చి పోచారం పై విమర్శలు చేయడం హాస్యాస్పదం అని ఎద్దేవ చేశారు.

బాజిరెడ్డి గోవర్ధన్ పై దుమ్మెత్తిపోశారు..గోవర్ధన్ రాజకీయ జీవితం మొత్తం కాంగ్రెస్ పార్టీతోనే ముడిపడి ఉందని, రెండోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత బాన్సువాడ వైపు చూసే స్థితి కూడా ఆయనకు రాలేదని గుర్తు చేశారు. అలాంటి ఓడిపోయిన వ్యక్తి ఈరోజు వచ్చి పోచారం పై విమర్శలు చేయడం ప్రజల కళ్లలో హాస్యాస్పదమని అన్నారు.బాజిరెడ్డి,ప్రశాంత్ రెడ్డి లు నాటి సీఎం కేసీఆర్ వెంటే ఉన్నప్పుడు మీరు మీ మీ నియోజకవర్గాలలో ఎందుకు పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ లు కట్టించలేక పోయారని ప్రశ్నించారు.మీకు మీ స్వార్థాలే తప్ప ప్రజలకోసం పనిచేయడం తెలియదని, పోచారం శ్రీనివాస్ రెడ్డి కి ప్రజా సేవ ఒక్కటే తెలుసునని,తన నియోజకవర్గ ప్రజలకోసం ఎంత వరకైనా తెగిస్తారని అన్నారు.

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో పోచారం కృషి

బాన్సువాడలో పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు ఏర్పాటు చేసి వేలాది విద్యార్థులకు వెలుగునిచ్చారు. వైద్యరంగంలో మాతా–శిశు ఆసుపత్రి, పీహెచ్‌సీల అభివృద్ధి, ఆధునిక వైద్య సదుపాయాలు అందించారు. రైతుల కోసం గోదావరి జలాలను తెచ్చి పచ్చని పంటల పల్లెలుగా బాన్సువాడను తీర్చిదిద్దారు. మార్కెట్ యార్డులు, గిడ్డంగులు ఏర్పాటు చేసి రైతులకు రక్షణ కల్పించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో చరిత్ర సృష్టించిన పోచారం...దేశంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడలో పది వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ప్రతి నిరుపేద కుటుంబానికి ఒక నీడ కల్పించిన ఘనత పోచారం శ్రీనివాస్ రెడ్డిదేనని ఆయన అనుచరులు స్పష్టం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు బాన్సువాడ ప్రజలపై పెత్తనం చెలాయించాలనుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

పోచారం మట్టిబిడ్డ విమర్శిస్తే ....తట్టుకోలేం"

బాన్సువాడ మట్టిలో పుట్టి, బాన్సువాడ అభివృద్ధికి జీవితాన్ని అర్పించిన నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి అని గర్వంగా గుర్తుచేశారు. అలాంటి నేతపై ఎక్కడి నుండో వచ్చిన నాయకులు విమర్శలు చేస్తే ప్రజలు సహించబోరని, ఇకపై ఇలాంటి ప్రయత్నాలు చేస్తే తగిన బదులు ఇవ్వక తప్పదని ఘాటుగా హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో పిట్ల శ్రీధర్ ,నార్ల సురేష్,మోహన్ నాయక్ ,దాసరి శ్రీనివాస్,నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు...

# అయిలమ్మ పోరాటం అసామాన్యం..పోచారం



**కామారెడ్డి, సెప్టెంబర్ 26 (సమయం న్యూస్):** తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన వీరవనిత చాకలి ఐలమ్మ మనందరికీ స్ఫూర్తి ప్రదాత అని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ రోడ్డులో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ

మహిళా శక్తికి ప్రతీక..చాకలి ఐలమ్మ అనేది కేవలం ఒక పేరు కాదు, తెలంగాణ చరిత్రలో అజరామరమైన ఒక ఉద్యమ గాథ అని అన్నారు. దోపిడీ, అన్యాయానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, మహిళా లోకానికి ధైర్యం నూరిపోసిన మహనీయురాలు ఐలమ్మ అని కొనియాడారు.

తెలంగాణ ఉద్యమానికి దీప్తి..తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం సాగిన రోజుల్లో ఐలమ్మ వంటి సాహసవనితలు చూపిన త్యాగమే మనకు ఈ రోజుని అందించిందని గుర్తు చేశారు. "ఆమె ధైర్యం లేకపోతే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటం అంత ఉత్సాహవంతంగా సాగేది కాదు" అని పోచారం అన్నారు.

ప్రస్తుత తరానికి ఆదర్శం...ఈ రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న తరుణంలో చాకలి ఐలమ్మ ఆలోచన, త్యాగం, పోరాటం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. మహిళలు ఆమె జీవితం నుంచి స్ఫూర్తి పొంది సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా నిర్వహించిన జయంతి..ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు, రజక సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. పూలమాలలతో వేసిఆమె స్ఫూర్తిని స్మరించుకున్నారు.

"చాకలి ఐలమ్మ పేరే శక్తి".."ఐలమ్మ పేరు వింటేనే ఓ వెలుగు, ఒక స్ఫూర్తి. నేడు తెలంగాణలో ప్రతి మహిళకు ధైర్యం, పోరాట స్ఫూర్తి కలిగించిన మహనీయురాలు ఆమె" అని పోచారం అన్నారు

# మద్యం దుకాణాలకు టెండర్లకు దరఖాస్తులు మొదలు కానున్నాయి

-ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ

**కోస్గి మున్సిపాలిటీ (మం)సెప్టెంబర్,26-09(సమయం న్యూస్) :** నూతన మద్యం విధాన పాలసిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్యం టెండర్లకు ఆహ్వానం పలుకుతుందని కోస్గి ఆబ్కారీ సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి సర్కిల్ పరిధిలో సుమారు 14 మద్యం దుకాణాలకు 2025-27సంవత్సరానికి కొత్త టెండర్లు వేయనునట్లు ఆయన తెలిపారు. కోస్గిలో 4,మద్దూర్ లో 3,దామరిగిద్ద లో 2,గుండుమాల్ లో 1,కొత్తపల్లి లో 1,మహ్మదబాద్ లో 1,నంచర్ల లో 1,గండిడు లో 1 షాప్ చొప్పున టెండర్లు వేయనునట్లు ఆయన తెలిపారు .ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ ,ఎస్టీ,గౌడ్,కులాలకు రిజర్వేషన్ల ప్రకారం షాపులు కేటాయించినట్లు తెలిపారు.కొత్త దుకాణాలకు టెండర్ల కోసం ఆసక్తి గల వారు నేటి నుండి మహబూబ్ నగర్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు పొంది కొత్త షాపులకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

# త్వరగా రోడ్డు వెయ్యండి.. అధికారులకు గ్రామస్తుల విన్నపం



**దుద్యాల మండలం, సెప్టెంబర్,26-09(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో లగచర్ల స్కూల్ దగ్గర హనుమాన్ టెంపుల్ దగ్గర నుంచి స్మశాన వాటిక వరకు రోడ్డు దారుణంగా వ్యక్తులకు వాహనాలకు చాలా ఇబ్బంది ఉంది గ్రామం మొత్తం రోడ్డు చెరువు చూసిన విధంగా ఉంది అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామంలోని యువకులు, పెద్దలు నాటు వేస్తూ శుక్రవారం నిరసన తెలపడం జరిగింది.

# ఏసీబీ వలలో మణుగూరు ఎస్ఐ రంజిత్



**భద్రాద్రి కొత్తగూడెం , సెప్టెంబర్ 26 : ( సమయం న్యూస్ :** ఓ కేసు విషయ మై స్టేషన్ బెయిలు కోసం బాధితుడు నుండి 40 వేలు డిమాండ్ చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు బత్తిన రంజిత్ శుక్రవారం ఏసీబీ వలకు చిక్కారు. 40 వేలకు ఒప్పందం కుదుర్చుకున్న ఫోన్ రికార్డింగ్ ఆధారంగా ఏ సి బి అధికారులు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఖమ్మం ఇంచార్జ్ ఏసీబీ , డి ఎస్పీ విజయ్ కుమార్ ప్రకటించారు. ఈ దాడుల్లో ఖమ్మం ఏసీబీ , సీ ఐ శేఖర్, సీఐ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

# రాయపోల్లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు.



**రాయపోల్,సెప్టెంబర్ 26:** చాకలి ఐలమ్మ 130 వ జయంతి వేడుకలు మండల కేంద్రం లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.పలువురు మాట్లాడుతూనేటి తరానికి చాకలి ఐలమ్మ జీవితం ఒక మార్గదర్శకమని,సాయుధ పోరాటంతో పెత్తందారు అణచివేతను వ్యతిరేకిస్తూ.. సమానత్వం కోసం పోరాడిన మహా గొప్ప మహనీయురాలని సమాజానికి ఆమె సేవలను గుర్తు చేశారు. నేటి తరానికి ఆమె ఒక మార్గదర్శకమని తెలిపారు.ఈ కార్యక్రమలో తెలంగాణ రజక రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులు వడ్లకొండ బిక్షపతి,చింత కింది మంజూరు,పీర్లపల్లి రవి, మహేందర్, చెప్యాల స్వామి,చింతకింది మహేష్, మైసిగారి బుధవ్వ,బాలమణి మల్లవ్వ, రామవ్వ, మల్లేష్ స్వామి, ప్రవీణ్ ,యాదయ్య గణేష్ మల్లయ్య ,లచ్చయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ ని కలిసిన రుద్ర గాని మాధవ్



**ఖమ్మం, సెప్టెంబర్ 26 : ( సమయం న్యూస్ ) :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ని బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు తో పాటు బిజెపి ఖమ్మం టూ టౌన్ కార్యదర్శి రుద్ర గాని మాధవ్ శుక్రవారం కరీంనగర్ లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కరీంనగర్ లో మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో భవాని దీక్షలో ఉన్న వారిని మర్యాదపూర్వకంగా కలుసుకొని కొద్దిసేపు ముచ్చటించారు .

27-09-25 Samayam_Layout 1 9/27/2025 2:42 AM Page 8



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంతో ఉండండి

● హైమావతి, సిద్దిపేట జిల్లా కలెక్టర్



**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 26 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను శుక్రవారం రోజు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మితంగా తనిఖీ చేయడం జరిగింది. ఓ.పి సేవలు ఏ విధంగా జరుగుతున్నాయని సిబ్బంది యొక్క హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేయడం జరిగింది. హాస్పిటల్ కి వచ్చిన జ్వరపీడితులను ఉద్దేశించి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతో ఉండాలని జ్వరం ను నిర్లక్ష్యం చేయవద్దని అది ప్రాణానికి ముప్పు వాటిల్లుతుందని ఈమధ్య డెంగ్యూ, విష జ్వరాలు ప్రబులుతున్నాయని ప్రజలందరూ అప్రమత్తతో ఉండి దగ్గరలో ఉన్న హాస్పిటల్ లో చూపించుకోవాలని సూచించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలనీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనీ లేనిచో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.స్థానిక వైద్యాధికారి డాక్టర్ బల్వీర్ సింగ్. సిహెచ్ఓ కాసిం ఎంపీహెచ్వో సురేందర్ శ్రీలత ఫార్మసి ఆఫీసర్ మమత హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కొడంగల్ తహసిల్దార్ దీపక్ శ్యామ్సన్





**కొడంగల్ మండలం, సెప్టెంబర్,26-09(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కోడంగల్ మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి వాగులు కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. కావున వాటిని దాటే ప్రయత్నలు చేయొద్దని తహసిల్దార్ దీపక్ సార్ హెచ్చరించారు. మరియు విద్యుత్ స్తంభాల వద్దకు పిల్లలను పెద్దలను. వెళ్ళ వద్దని సూచించారు.మరో రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని. తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

# అక్టోబర్ 18 లోపు మద్యం షాపుల కోసం దరఖాస్తులు సమర్పించాలి

● ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ నాగేంద్ర రెడ్డి

**ఖమ్మం, సెప్టెంబర్ 26 : ( సమయం న్యూస్ )** నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా మద్యం షాపుల నిర్వహణకు ఆసక్తి గలవారు అక్టోబర్ 18 లోపు దరఖాస్తులు దాఖలు చేయాలని జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ జి. నాగేంద్ర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-27 సంవత్సరానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 116 మద్యం షాపుల వేలం కొరకు స్వీకరించే దరఖాస్తులను అక్టోబర్ 18 వరకు స్వీకరించడం జరుగుతుందని, దరఖాస్తుదారుడు మూడు లక్షల రూపాయలను డిడి / చలాన్ రూపేన చెల్లించాలని, ఈ సొమ్ము తిరిగి చెల్లించబడవని అన్నారు.దరఖాస్తుదారుడు జిల్లా మద్యపాన నిషేధ అధికారి, ఖమ్మం పేరిట డిడి తీయాలని, దరఖాస్తుతో పాటు పాన్ కార్డు, ఆధార్ కార్డు సెల్ఫ్ సర్టిఫైడ్ కాపీ, కుల ధ్రువీకరణ పత్రం జత చేయాలని, దరఖాస్తులను ఖమ్మం కొత్త కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న ఎక్సైజ్ స్టేషన్ లో సమర్పించాలని ఆయన తెలిపారు.

మద్యం షాపుల దరఖాస్తులను ఖమ్మం లోని లేక్ వ్యూ ఫంక్షన్ హాల్ నందు అక్టోబర్ 23న ఉదయం 11.00 గంటలకు డ్రా ద్వారా కేటాయించడం జరుగుతుందనిఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# తుల్జా భవాని అమ్మవారి దేవాలయాన్ని పునరుద్ధరీకరణ చేస్తా

● ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి సెప్టెంబర్26 సమయం న్యూస్. :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ తుల్జభవాని అమ్మవారి ఆలయం చందానగర్ లోని పలు అమ్మవారి మండపాలను దసరా నవరాత్రుల పర్వదిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని పిఏసీ ఛైర్మెన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరెఖపూడి గాంధీతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలందరికీ సుఖశాంతులను ఆయురారోగ్యాలను అందించాలని వేడుకున్నట్లుగా తెలియ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి చెందిన తుల్జాభవాని అమ్మవారి ఆలయ పునరుద్ధీకరణ నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని అతి త్వరలో చేపట్టబోతున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్,అధ్యక్షులు వీరేశం గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, ప్రవీణ్, శ్రీనివాస్ యాదవ్, వార్డ్ మెంబర్ కవిత గోపాల్ కృష్ణ, వార్డ్ మెంబెర్ రాము, తుల్జభవాని టెంపుల్ ఈఓ సత్య చంద్ర రెడ్డి, పవన్ గుప్త, పాండు, ఎస్ ఎల్ వి డి సి. రవి యాదవ్, కృష్ణ, నటరాజ్, కిరణ్ యాదవ్, శేఖర్, సంపత్, మల్లేష్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనాథ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ పురపాలక సంఘ కార్యాలయం ఈరోజు పూలతో, పాటలతో కళకళలాడింది.



**కామారెడ్డి, సెప్టెంబర్ 26 (సమయం న్యూస్) :** బాన్సువాడ పురపాలక సంఘ కార్యాలయం ఈరోజు పూలతో, పాటలతో కళకళలాడింది. తెలంగాణ సాంప్రదాయాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను కార్యాలయ సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూవులతో ముస్తాబైన బతుకమ్మలు కార్యాలయ ఆవరణను రంగురంగుల తోటలా మార్చాయి. మహిళా సిబ్బంది సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ చుట్టూ ఆడిపాడుతూ పండుగ ఉత్సాహాన్ని మరింతగా పంచారు.

**పూల రాగంలో బతుకమ్మలు మెరిసిన వేళ**

కార్యాలయంలో ఒక మూలన వర్ణరంజిత పూలతో అలంకరించిన బతుకమ్మలు ఆహ్లాదాన్ని పంచగా, మరోవైపు మహిళల పాటలు, సాంప్రదాయ నృత్యాలు పండుగ వాతావరణాన్ని సజీవ చిత్రంలా తీర్చిదిద్దాయి. ప్రతీ ఒక్క బతుకమ్మలో తీరొక్క పూల సువాసన వ్యాపించి వాతావరణాన్ని మనోహరంగా మార్చింది.

**ప్రకృతి పండగ అని కమిషనర్ శ్రీహరి రాజు**

ఈ సందర్భంగా బాన్సువాడ పురపాలక కమిషనర్ శ్రీహరి రాజు మాట్లాడుతూ %“బతుకమ్మ మన సంస్కృతి ఆత్మ. ఇది మహిళల సృజనాత్మకతకు, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీక. పూలతో సృష్టించే ఈ పండుగ పర్యావరణ హితాన్ని, సాంప్రదాయ వైభవాన్ని మనకు గుర్తు చేస్తుంది” అని అన్నారు.

**ప్రతి ఒక్కరి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ**

కార్యక్రమంలో ఏఈ జగన్ మోహన్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ హన్మండ్లు, సతీష్, మహిళా సిబ్బంది సునంద, స్వాతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. సిబ్బంది సమిష్టిగా బతుకమ్మ చుట్టూ ఆడిపాడి ఆనందం పంచుకున్నారు.

**బాన్సువాడలో బతుకమ్మ శోభ**

పురపాలక కార్యాలయ ప్రాంగణం పూలదండలతో, సాంప్రదాయ సువాసనలతో మెరిసిపోయింది. బతుకమ్మ చుట్టూ ఆడిన కాసింత నృత్యం, పలికిన పాటలతో ఒక వర్ణరంజిత సాంస్కృతిక వాతావరణం నెలకొంది. అక్కడి ప్రతి ఒక్కరూ బతుకమ్మలోని ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తూ పండుగను ఆనందోత్సాహాలతో ముగించారు.

# తెలంగాణా సంస్కృతి మరియు సాంప్రదాయాలు ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు

- తెలంగాణా సంస్కృతి మరియు సాంప్రదాయాలు ప్రతిబింబించేలా
- బతుకమ్మ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని,
- ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబరమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్







**వికారాబాద్, సెప్టెంబర్,26-09(సమయం న్యూస్) :** శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా డి ఆర్ డి ఎ ,మెప్మా,ఉద్యానవన , శిశు సంక్షేమ,శాఖ ల వారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మలతో బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గౌరీమాత పూజ నిర్వహించి బతుకమ్మ పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డి ఆర్ డి ఎ, డి డబ్ల్యు ఓ అధికారుల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ కార్యక్రమం లో పాల్గొని,మహిళా ఉద్యోగులు స్వయంగా బతుకమ్మలను పేర్చి ఆయా శాఖల నుండి ఉద్యోగుల అందరితో కలిసి తీసుకొచ్చిన బతుకమ్మలతో పాటలు పాడుతూ సందడి చేసి కలెక్టరేట్ కు ప్రత్యేక శోభను తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ బతుకమ్మల వద్దకు వెళ్లి మహిళలతో బతుకమ్మ ఆట ఆడి బతుకమ్మ ఉత్సవానికి మరింత ఊపును తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబరమని ఇలాంటి బతుకమ్మ పండుగను కలెక్టర్ కార్యాలయంలో ఇంత ఆనందంగా జరుపుకోవడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ ఉద్యోగులు ఆనందంగా ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని కలెక్టరేట్ కు కొత్త శోభను తీసుకువచ్చారని అన్నారు. అదేవిధంగా జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ మరియు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యా నాయక్, అదనపు కలెక్టర్ (స్థానిక సమస్తలు) సుదీర్ ,అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డి ఆర్ ఓ మంగీ లాల్ , అడిషనల్ డిఆర్డిఏ నరసింహులు, శిశుసంక్షేమ అధికారి కృష్ణవేణి,డి పి ఆర్ ఓ చెన్నమ్మ,డి పి ఓ జయసుధ,డ్వాక్ర గ్రూప్ మహిళలు,ఇతర శాఖల జిల్లా అధికారులు ,అన్నిశాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళ చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

- పటాన్ చెరులోఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**పటాన్ చెరు, సెప్టెంబర్ 26(సమయం న్యూస్) :** గడిలపై గళమెత్తి, తెలంగాణ రాష్ట్రంలో భూ పోరాటానికి నాంది పలికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకొని పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించి మహిళా చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ పేరును హైదరాబాదులోని మహిళా విశ్వవిద్యాలయానికి నామకరణం చేశారని గుర్తు చేశారు. వారి వారసులకు సైతం సముచిత గౌరవం కల్పించారని పేర్కొన్నారు. ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలోమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకటేష్, రజక సంఘం అధ్యక్షుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# జంగంపేట ఎల్లమ్మ ఆలయంలో మహాలక్ష్మి అవతారంలో అమ్మవారి దర్శనం



**పటాన్ చెరు,జిన్నారం, సెప్టెంబర్ 26(సమయం న్యూస్):** జిన్నారం మున్సిపల్ పరిధిలోని జంగంపేట గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నాడు ఉత్సవాల ఐదవ రోజు సందర్భంగా రేణుకాంభా మాత శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం రోజుతో మహాలక్ష్మి అవతారం సమకూరడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకోవడం విశేషంగా మారింది. ఆలయ ప్రాంగణం నిండా పండుగ వాతావరణం అలుముకుంది.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాస భార్గవ ఆధ్వర్యంలో మహిళా భక్తులచే ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో దర్శించడం భక్తులకు అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని వారు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.సాంప్రదాయ వాద్యాలు, మంగళహారతుల మధ్య అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ మహిళలు కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందగా, యువతులు, చిన్నారులు కూడా పూజల్లో భాగమయ్యారు. రేణుకాంభా మాత మహాలక్ష్మి రూపంలో దర్శనం ఇవ్వడంతో గ్రామంలో ఉత్సాహం మరింత రెట్టింపైంది.ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తుల రద్దీ కారణంగా వాహనాల రాకపోకలు కష్టసాధ్యమయ్యాయి. అయినప్పటికీ, ఆలయ కమిటీ మరియు గ్రామ యువతులు స్వచ్ఛందంగా సేవలందించి భక్తులకు సౌకర్యాలు కల్పించారు.శరన్నవరాత్రుల ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారు భిన్న అవతారాల్లో దర్శనమిస్తూ భక్తులను కటాక్షించడం జంగంపేట గ్రామ ప్రజలకు గర్వకారణంగా మారింది. భక్తులు మహాలక్ష్మి అవతార దర్శనం తమ ఇంటి ఆర్థిక సౌభాగ్యానికి, కుటుంబ శ్రేయస్సుకు సంకేతమని విశ్వసిస్తున్నారు.

# ఉత్తమ పనితీరుకు అవార్డుల పంట.



**నిర్మల్ సెప్టెంబర్26( సమయం న్యూస్).:** నిర్మల్ జిల్లా గత కొన్ని రోజులుగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎన్నో గొప్ప గొప్ప అవార్డులు సాధిస్తూ వస్తుంది. జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా విరాజిల్లుతుంది. జిల్లా ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పనితీరుతో ఎంతో గొప్ప పేరు సంపాదిస్తూ, ఎన్నో అవార్డులు, రివార్డులు సొంత చేసుకుంటుంది. దీనంతటికి జిల్లా అధికారుల కార్యదీక్షనే కారణం. ముఖ్యంగా ఏడాది కాలంలో మూడు రంగాల్లో జాతీయ స్థాయిలో అవార్డులు లభించాయి. జల్ సంచాయ్ - జన భాగిధారి, పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమాలు, బెస్ట్ టూరిజం విలేజ్ అవార్డు జిల్లాకు దక్కడం గర్వించదగ్గ విషయం. జల్ సంచాయ్ - జన భాగిధారి కార్యక్రమంలో ఉత్తమ స్థానంలో నిలిచిన నిర్మల్ జిల్లా.

భూగర్భ జలాల సంరక్షణలో భాగంగా చేపట్టిన జల్ సంచాయ్ - జన భాగిధారి కార్యక్రమంలో భాగంగా తీసుకున్న చర్యలకు గాను నిర్మల్ జిల్లా దేశవ్యాప్తంగా అపార ఖ్యాతి గడించింది. వర్షపు నీటి సంరక్షణ, మెరుగైన ప్రజల భాగస్వామ్యంలో భాగంగా నిర్దేశించిన అన్ని పనులు పకడ్బందీగా పూర్తిచేసినందుకు గాను కేటగిరి - 2 లో జిల్లాకు జాతీయ స్థాయిలోనే రెండో ర్యాంకు సాధించి, కోటి రూపాయల నగదు బహుమతి సొంతం చేసుకుంది. ఇది జిల్లాకు ఎంతో గర్వకారణం. ఈ కార్యక్రమం ప్రతిపాదించిన నాటినుంచి అధికారులు ప్రజల భాగస్వామ్యంతో పనిచేశారు. జల సంరక్షణలో భాగంగా చెరువులు, వాగులు, వానజలాల హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, చెక్‌డ్యాంల నిర్మాణం, వాటికి మరమ్మత్తులు చేపట్టి, భూగర్భజలాలను సంరక్షించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాలన్నీ దేశవ్యాప్తంగా ఉన్నతాధికారుల మెప్పు పొందాయి. ఈ కార్యక్రమాలలో ప్రజలను ప్రత్యక్ష భాగస్వాములను చేయడంతో ఈ విజయం సొంతమైంది. దేశ వ్యాప్తంగా నిర్మల్ జిల్లా రెండో ర్యాంకులో నిలవడం ఎంతో గొప్ప విషయం. ఇది అధికారుల కృషి, నిబద్ధతకు, ప్రజల భాగస్వామ్యానికి కొలమానం.

**పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ విజయంతో పెరిగిన జిల్లా ఖ్యాతి.**

ఇటీవలి నీతి అయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా పెంబి బ్లాకు జాతీయస్థాయిలోనే నాలుగవ స్థానంలో నిలిచినందుకు కాంస్య పతకం లభించింది. దీంతో జిల్లా పేరు మరొక్కసారి దేశవ్యాప్తంగా ఖ్యాతిని గడించింది. నీతి అయోగ్ యాస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అత్యంత వెనుకబడిన 500 మండలాలను ఎంపిక చేసింది. జిల్లాలోని పెంబి బ్లాకు ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో ఒక బ్లాకు గా ఎంపికైంది. ప్రభుత్వం ఈ బ్లాకుల అభివృద్ధికి ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా ఎంపిక కాబడిన పెంబి బ్లాకులో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సూచనలతో అధికారులంతా ఆ ప్రాంత ప్రజల అభివృద్ధికై కృషి చేశారు. సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా. మూడు నెలల పాటు అభివృద్ధి కార్యక్రమాలు యజ్ఞంలా నిర్వహించారు. వ్యవసాయ, వైద్య, విద్యా, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ, తదితర శాఖల అధికారులు త్రైమాసిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం విషయాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మధుమేహం, రక్తపోటు, పోషక లోపాల నివారణ అంశాల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఆరు సూచికలలో భాగంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమ అమలుకు ముందు, తర్వాత చూసుకుంటే గుణాత్మక మార్పులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో చేపట్టిన కృషికి గాను, జాతీయస్థాయిలోనే మెరుగైన ఫలితాలను సాధించి నాలుగవ స్థానంలో నిలిచింది. ఇందుకుగాను కాంస్య పతకం లభించింది. ఇప్పుడు ఈ పెంబి మండలం ఆకాంక్షిత మండలం నుంచి మార్గదర్శక మండలంగా మారింది. పెంబి బ్లాకు జాతీయ స్థాయిలోనే నాలుగవ స్థానంలో నిలిచింది.

**ఉత్తమ పర్యాటక ప్రాంతంగా నిలిచిన నిర్మల్.**

ఉత్తమ హస్తకళల విభాగంలో బెస్ట్ టూరిజం విలేజ్ గా నిర్మల్ జిల్లా నిలిచింది. 27 సెప్టెంబర్, 2024 న, ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన భవన్ లో పర్యాటక రంగానికి సంబంధించి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ల అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కొయ్య బొమ్మల పునరుజ్జీవనానికి, హస్తకళలు కాపాడేందుకు అధికారులు చేపట్టిన చర్యలకు గాను బెస్ట్ టూరిజం విలేజ్ అవార్డు లభించింది. ఈ అవార్డులు, రివార్డులే కాకుండా, రాష్ట్రస్థాయిలోనూ పలు శాఖల పనితీరులో నిర్మల్ జిల్లా ఉత్తమ స్థానంలో నిలుస్తూ వచ్చింది. ఈ ఫలితాలన్నీ అధికారుల కృషికి, నిదర్శనం. ఈ ఉత్తమ ఫలితాలు భవిష్యత్తులో వివిధ శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడానికి ఎంతగానో స్ఫూర్తిని నింపుతున్నాయి.

**అవార్డులు జిల్లాకు గర్వకారణం.**

"గడిచిన ఏడాది కాలంలోనే జిల్లాలోని వివిధ శాఖల్లో చేపట్టిన పనులకు మూడు రంగాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు లభించాయి. ఇది జిల్లా అధికారుల కృషి, నిబద్ధతకు నిదర్శనం. జిల్లా చరిత్రలో మైలురాయి. పలు రంగాల్లో ఎన్నో విజయాలు సాధించేలా ప్రోత్సహించిన జిల్లా పూర్వపు ఇన్ చార్జి మంత్రి సీతక్క, ప్రస్తుత జిల్లా ఇన్ చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు లకు ధన్యవాదాలు. వీరి ప్రోత్సాహం మరువలేనిది. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, అందరూ కలసి నీటి సంరక్షణలో చేసిన కృషికి గాను జల్ సంచయ్ %-% జన భాగిధారి కార్యక్రమంలో జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ లభించింది. ఇది ఎంతో గర్వించదగ్గ విషయం.

కొద్దిరోజుల క్రితమే నీతి ఆయోగ్ పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో చేపట్టిన పనులకు గాను జాతీయస్థాయిలోనే నాల్గవ స్థానం లభించింది. కాంస్య పథకం రావడం గొప్ప విషయం. ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో చేపట్టిన పనుల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. కొయ్య బొమ్మల పరిరక్షణలో భాగంగా చేపట్టిన చర్యలకు గాను, నిర్మల్ జిల్లా బెస్ట్ టూరిజం విలేజ్ అవార్డును సొంతం చేసుకుంది. ఇలా ఎన్నో అవార్డులు, రివార్డులు జిల్లాకు లభించడం సంతోషకరమైన విషయం. రాబోయే రోజుల్లో మరిన్ని రంగాల్లో జాతీయస్థాయిలో అగ్రస్థానం సాధించేలా కృషి చేస్తాం. ప్రజలందరినీ అన్ని కార్యక్రమాల్లో విస్తృతంగా భాగస్వామ్యం చేస్తాము. ప్రజలకు, అధికారులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు, శుభాకాంక్షలు." అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.

# యాత్రదానం కర పత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్ సెప్టెంబర్26( సమయం న్యూస్). :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రారంభించిన వినూత్న పథకం "యాత్ర దానం ద్వారా సామాజిక సేవలో పాల్గొనాలని స్వచ్ఛంద సంస్థలకు, కార్పొరేట్ సంస్థలకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్ లో ఆర్టీసీ డిఎం సురేఖ, ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి యాత్ర దానం కరపత్రాలను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ బస్సు యాత్ర దానం చేయడానికి వినూత్న పథకం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వివిధ సంఘాలు, స్వంత్ఛంధ సంస్థలు, వ్యక్తులు, కుటుంబాలు, ఎన్ ఆర్ వోలు, వెబ్ జి, ఓ లు, యూత్ ఆర్గనైజేషన్స్, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు స్పాన్సర్ షిప్ చేసి అనాధలకు వృద్ధాశ్రమాలకు, ప్రభుత్వ పాఠశాలలకు, పేద విద్యార్థులకు, పేదవారికి అన్న దానం, వస్త్ర దానం, విద్యా దానం చేస్తూ తమ ' ఉదారతను చాటుతున్న ప్రతి ఒక్కరికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మా బస్సు ద్వారా " యాత్ర దానం" చేయటానికి ఆర్. టి. సి. సంస్థ వారు ఒక వినూత్న పథకం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకంలో సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆర్టీసీ డిఎం సురేఖ మాట్లాడుతూపుట్టిన రోజులు, పెళ్ళి రోజులు, ఇతర శుభకార్యాలు, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఆర్టిసి సంస్థ యాత్ర దానం పథకం సహాయ సహకారాలు అందించిన ద్వారా ఎంతోమంది పేదవారికి పుణ్యక్షేత్రాలు పర్యాటక ప్రాంతాలు, విహార విజ్ఞాన యాత్రలు, ఇతర దర్శనీయ స్థలాలు చూపించే మంచి అవకాశం కల్పించడం జరుగుతుందని చెప్పారు. యాత్ర దానం చేయవలసిన వారు మీరు ఇవాలనుకున్నా యాత్ర వివరాలను తెలియపరుస్తూ సంస్థకు విరాళం అందజేసినట్టైతే సురక్షితమైన బస్సు సదుపాయాన్ని కల్పించటానిక మెదక్ మరియు నర్మాపూర్ డిపో సిబ్బంది అందుబాటులో ఉంటారని యాత్ర దానం చేయవలసిన వారు వారు మెదక్ డిపోలో నర్సాపూర్ 9959226268, 7780 77 5815, 81422-522-82 డిపోల 9491634420, 9701724155 నంబర్లను సంప్రదించవచ్చు. అని వివరించారు.

# భారీ వర్షాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

## పి. ప్రావిణ్య, జిల్లా కలెక్టర్.

**సంగారెడ్డి సెప్టెంబర్26( సమయం న్యూస్). :** అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి. వాహనాల రాకపోకలకు ఆటంకం కలవకుండా చర్యలు తీసుకోవాలి.

తక్షణ సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ ను 08455276155తాసిల్దారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, నీటిపారుదల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు సురక్షితంగా ఉండేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు ,మున్సిపల్ అధికారులు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అగ్నిమాపక శాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశంను నిర్వహించారు . జిల్లా లో కురుస్తున్న వర్షాలకు చెరువులు ,కుంటలు నిండిన వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. చెరువులు, కుంటలు నిండిన చోట ఓవర్ ఫ్లో అవుతున్న నీరు, నివాస ప్రాంతాలకు రాకుండా అవసరమైన ఏర్పాట్లు నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో చేయాలన్నారు. పటాన్చెరువు మండలం పరిధి లోని ముత్తంగి ,ఇస్నాపూర్ ప్రాంతాలలో హైవే పై వస్తున్న నీరు వలన వాహనాల రాకపోకలకు ఆటంకం కలవకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంగారెడ్డి ఆర్డీవో,ఎన్ హెచ్ అధికారులను , తహసీల్దారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఎస్ డి ఆర్ ఎఫ్ , రిస్క్యూ టీం లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే రిస్క్యూ టీం అక్కడ ఒక చేరుకునేలా అవసరమైన విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారికి ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు ఎక్కడ ఏ సమస్య తలెత్తిన తక్షణం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించేలా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా లో లెవెల్ వంతెనల పైనుండి మీరు వెళ్తుంటే ఆ మార్గాలను మూసివేసి మార్గాలలో ట్రాఫిక్ మల్లిపు చర్యలు చేపట్టాలన్న అవసరమైతే పోలీస్ శాఖ అధికారులు సహాయం తీసుకొని ట్రాఫిక్ మళ్లించాలని సూచించారు. జిల్లాలో సమస్యలకు తక్షణ సహాయం కోసం ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ ను 08455276155 సంప్రదించాలని, టోల్ ఫ్రీ నెంబర్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. భారీ వర్షాలు అవకారణంగా అంటువ్యాధుల ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవసరమైన మందు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ ,మాధురి , నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ , ఆర్డీవోలు పాండు ,రాజేందర్ ,దేవుజా , డి ఏ ఓ శివప్రసాద్ , జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు , తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, డివిజనల్ సూపరింటెండెంట్, ఆర్ %డ% బి ఇఈ లు, పంచాయతీరాజ్ ఇఈలు, ఎస్ఈ ఎస్పీ డి సి ఎల్ ,ఎస్ఈ ఇరిగేషన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల టెండర్లకు దరఖాస్తులు చేసుకోవాలి

**● కొడంగల్ ఎక్సైజ్ సీఐ -జి.వెంకటేష్ ముదిరాజ్**



ఇందుమూలంగా తెలంగాణ నూతన మద్యం పాలసీ 2025-2027 సంవత్సరాలకు గానూ స్టేషన్ పరిధిలో వున్నా 8 మద్యం దుకాణాలకు గానూ, 2 మద్యం దుకాణాలు గౌడ సామాజిక వర్గానికి, మిగతా 6 మద్యం దుకాణాలకు ఓపెన్ కేటగిరి క్రింద ఎవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చు ఎక్సైజ్ సీఐ- జి.వెంకటేష్ ముదిరరాజ్ ..కొడంగల్ 01.గౌడ్,రావుల పల్లి.గౌడ్,కొడంగల్ 02 జనరల్ ,కొడంగల్ 03 జనరల్, బొంరస్ పేట జనరల్,దుద్యాల. జనరల్,దౌల్తాబాద్. జనరల్,గోక ఫస్లవాద్. జనరల్ దరఖాస్తు రుసుము ₹55 లక్షల రూపాయలవి 06 మద్యం దుకాణాలు, ₹ 50లక్షల రూపాయలవి 2 మద్యం దుకాణము వున్నవి. దరఖాస్తులు 26/09/2025 నుండి 18/10/2025 వరకు జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి, వికారాబాద్ కార్యాలయం నందు మరియు కమీషనర్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్, నాంపల్లి, హైదరాబాద్ కార్యాలయం నందు దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు రుసుము ₹ 3 లక్షల రూపాయలు డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చాలాన్ రూపంలో చెల్లించవచ్చు. లక్కీ డ్రా తేది 23.10.25 నాడు కలెక్టర్ కార్యాలయం లో జరుగుతుందని ప్రోహిబిషన్ % ఎక్సజ్ ఇన్స్పెక్టర్ జి. వెంకటేష్ ముదిరాజ్ తెలిపారు.

# జూబ్లీహిల్స్ అభ్యర్థిని ఖరారు చేసిన కేసీఆర్.



**హైదరాబాద్ సెప్టెంబర్ 26 సమయం న్యూస్.:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక కోసం అభ్యర్థిని శుక్రవారం బీఆర్ఎస్ అధికారికంగా ప్రకటించింది. మాగంటి సునీత పేరును ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఖరారు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో కీలక నేతలతో భేటీ తర్వాత ఈ ప్రకటన వెలువడింది. మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఆయన సతీమణి మాగంటి సునీతే పోటీ చేస్తారని ఇది వరకే ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎన్నిక ప్రచార కార్యక్రమాల్లో అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు అధినేత ఆమోదంతో పార్టీ ప్రకటన చేసింది. అయితే ఈ ఉప ఎన్నికకు సంబంధించి షెడ్యూల్ ఇంకా విడుదల కావాల్సి ఉంది. కేసీఆర్‌కు కృతజ్ఞతలుజూబ్లీహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థిత్వంపై సునీత పార్టీ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. మాగంటి గోపీనాథ్ పట్ల ఉన్న విశ్వాసంతో, నాపై నమ్మకం ఉంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించారు. ఇందుకుగానూ పార్టీ అధినేత కేసీఆర్‌కు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ ఎన్నికల్లో మీ అందరి మద్దతు, ఆశీర్వాదం నాపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారామె.

# భారీ వర్షాలు కురుస్తున్నా సందర్భంగా పలు గ్రామాల వాగులు వరద ఉధృతిని పరిశీలించిన-తహేసిల్దార్






**కొడంగల్ మండలం, సెప్టెంబర్,26-09(సమయం న్యూస్) :** గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొడంగల్ తహసిల్దార్ దీపక్ శ్యామ్సన్ సూచించారు. శుక్రవారం పోలీస్ సిబ్బంది మరియు జిపివో గోపాల్,ఆర్ ఐ రాఘవేంద్రర్ తో కలిసి వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల పరిధిలోని చిట్లపల్లి, నాగారం, అంగడి రైచుర్, గ్రామాలను సందర్శించి వాగుల వరద ఉధృతిని పరిశీలించారు. వివిధ పనులపై తరచూ ప్రయాణించే ప్రజలంతా అప్రమాత్తంగా గా ఉండి వాగులు దాటి సమయంలో జాగ్రత్త పాటించాలని అన్నారు. అత్యవసరం అయితేనే బయటికి రావాలన్నారు. పశువుల కాపరులు, పంట పొలాలకు వెళ్లే రైతులు మరీ జాగ్రత్తలు పాటించి ఇతరుల సహాయం చేసుకోవాలన్నారు. చిట్లపల్లి గ్రామ సమీపంలో వరద నీరు పారుతున్న కల్వర్టును పరిశీలించారు. అత్యవసరం అనుకుంటే సంబంధిత ప్రభుత్వాధికారులకు సమాచారం అందించాలని ఆయా గ్రామ ప్రజలకు సూచించారు.

# భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మున్సిపల్ వార్డు అధికారులతో సమీక్ష

**-మున్సిపల్ కమిషనర్ బి.బలరాం నాయక్**



భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కమీషనర్ బి.బలరాం నాయక్ మున్సిపల్ వార్డు అధికారులతో వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు, తుఫాను ప్రభావంతో శిథిలావస్థలో ఉన్న గృహాలు, భవనాలతో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. వర్షపు నీరు గోడలు, పైకప్పులు, పునాదుల్లోకి చొరబడి నిర్మాణ బలహీనతను మరింత పెంచుతోందని, దీని వలన గోడలు కూలిపోవడం, పైకప్పులు పడిపోవడం లేదా మొత్తం భవనం కూలిపోవడం వంటి ప్రమాదాలు సంభవించవచ్చు అన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు సురక్షిత ప్రదేశాలకు లేదా తాత్కాలిక పునరావాస కేంద్రాల్లో ఉండాలన్నారు. ఎవరైనా తమ ఇళ్లలో గోడలు, పైకప్పుల్లో పగుళ్లు లేదా ఇతర నిర్మాణ మార్పులు గమనించిన వెంటనే మున్సిపల్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదకర భవనాలను కూల్చివేసే చర్యలు కూడా తీసుకుంటామని పేర్కొన్నారు.

27-09-25 Samayam_Layout 1 9/27/2025 2:42 AM Page 10



## జై దుర్గా భవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు



**ఖమ్మం , సెప్టెంబర్ 26: ( సమయం న్యూస్ )** జై దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వెంకటేశ్వర నగర్ లో నాలుగవ వార్షికోత్సవం సందర్భం గా దుర్గా అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల లో భాగంగా ఏర్పాటు చేసిన కుంకుమ పూజలో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళా భక్తులు పాల్గొని తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

## కొబ్బరి పీచు పరిశ్రమను సందర్శించిన పటేల్ గూడ మహిళలు



**పటాన్ చెరు, గుమ్మడిదల, సెప్టెంబర్ 26(సమయం న్యూస్) :** అమీన్పూర్ మండలం పటేల్ గూడ గ్రామానికి చెందిన మహిళలు కేంద్ర ప్రభుత్వ సంస్థ క్వాయర్ బోర్డ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతూ గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కొబ్బరి పీచు పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమ వ్యవస్థాపకులు చెన్నంశెట్టి మౌనిక ఉదయ్ కుమార్ మహిళలకు పీచు తయారీ ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా తాగి పారేసే కొబ్బరి బొండాలను ఉపయోగించి విలువైన కొబ్బరి పీచు తయారు చేయవచ్చని, ఆ పీచుతో తాడులు, వివిధ రకాల బొమ్మలు తయారు చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా కొబ్బరి పొట్టును డీకంపోస్ట్ చేసి మొక్కలకు ఎరువుగా ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈ సందర్శనలో మహిళలు పరిశ్రమ పనితీరును ప్రత్యక్షంగా వీక్షించి, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన పొందారు. కార్యక్రమంలో క్వాయర్ బోర్డ్ ప్రోగ్రాం మేనేజర్ ప్రసాద్, ట్రైనర్ మీనాతో పాటు మహిళలు పాల్గొన్నారు.

## పేదవారి సంజీవిని ముఖ్యమంత్రి సహాయనిది

- 2.50లక్షల ఎల్వోసి ని అందించిన పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, సెప్టెంబర్ 26(సమయం న్యూస్) :** నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బిహెచ్ఇఎల్ టౌన్షిప్ లో నివసిస్తున్న షేక్ ఇబ్రహీం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో షేక్ ఇబ్రహీం కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, శ్రీధర్ చారి, చంద్రశేఖర్, రామిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.



**సమయం న్యూస్ మహబూబ్ నగర్. :** జిల్లా లో నిర్మాణం లో ఉన్న బోధనా ఆసుపత్రి భవనాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం పరిశీలించారు వెయ్యి పడకల బోధన ఆసుపత్రి భవనం ప్లాన్,నిర్మాణం ప్రగతి గురించి తెలంగాణ వైద్య మౌలిక సదు-పాయాలు అభివృద్ధి సంస్థ ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ కు వివరించారు. తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాలు అభివృద్ధి సంస్థ ఈ ఈ వేణుగోపాల్, ఏ. ఈ. శరత్ చంద్ర తదితరులు ఉన్నారు

## అనాధ పిల్లలకు కలెక్టర్- ఆయుష్మాన్ కార్డుల పంపిణీ

- పిల్లలతో సహపంక్తి భోజనం
- ప్రతి మూడు నెలలకు సమావేశం



**ఆదిలాబాద్ సెప్టెంబర్26( సమయం న్యూస్).:** కలెక్టరేట్ సమావేశ మందిరం లో శుక్రవారం అనాధ పిల్లలు, కోవిడ్ పిఎం కేర్ ఫర్ చిల్డ్రన్ లతో కలెక్టర్ రాజర్షి షా సమావేశమయ్యారు. విద్యా, ఆరోగ్యం , వారి సమస్యలు తదితర అంశాలపై పిల్లలతో చర్చించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసి, పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. జిల్లాలోని 202 మంది పిల్లలకు ఆరోగ్యశ్రీ, 8 మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు అందించామని తెలిపారు. వసతి లేని అనాధ పిల్లల సంరక్షకులకు ఇందిరమ్మ ఇళు మంజూరు చేస్తామని, వారి సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా సహాయం అందిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రతి మూడు నెలలకోసారి పిల్లలతో సమావేశమవుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రతీ ఒక్కరితో మాట్లాడించి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానని తెలిపారు .ఈ సందర్భంగా ఆర్బీఎస్కే కాంపు ద్వారా పిల్లల రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, డీడబ్ల్యూఓ మిల్కా, డిసిపీఓ రాజేంద్రప్రసాద్, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టండి

- నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
- బాలసముద్రం ఫ్రీడం పార్క్ ప్రాంతం లో శానిటేషన్ పరిశీలన....
- రామన్న పేట ప్రాంతం లో మురికి కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం...



**వరంగల్ సెప్టెంబర్26( సమయం న్యూస్).:** వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా పరిధి లోని హన్మకొండ బాలసముద్రం ప్రాంతం లోని ఫ్రీడం పార్క్ సమీపం లో పలు ప్రాంతాల తో పాటు వరంగల్ పరిధి రామన్న పేట ప్రాంతం లో శానిటేషన్, ఇంజనీరింగ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరం లోని పలు ప్రాంతాలలో వరద నీరు నిలిచే అవకాశం ఉంటుందని అట్టి ప్రాంతాల్లో ఎప్పటికపుడు నీటిని తొలగించాలని అన్నారు. ఇదే ప్రాంతం లో జే సి బి నుండి టిప్పర్ లోకి తరలిస్తున్న చెత్త తరలింపు విధానాన్ని మేయర్ పరిశీలించారు. వరంగల్ పరిధి రామన్న పేట ప్రాంతం లో వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక వైపు ప్రాంతం లో వరద నీరు నిలిచిన నేపథ్యం లో ఆ ప్రాంతం లో పర్యటించి నీటిని తొలగించేలా అధికారులను ఆదేశించారు. పై నుండి వచ్చే వరద నీరు తో పాటు చెత్త చెదారం డ్రైన్ లలో పేరుకుపోవడం వల్ల నీరు నిలుస్తుందని వర్షాకాలం ముగిసేవరకు ఈప్రాంతం పై ప్రత్యేక దృష్టి సారించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని నీరు సాఫీగా వెళ్ళిపోవడానికి వీలుగా అవసరం మేరకు డ్రైన్ పై కప్పు తొలగించి చెత్తను తొలగించాలని ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండడానికి మురికి కాలువలు ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ సందర్భం గా మేయర్ అన్నారు. ఈ కార్యక్రమం లో సి ఏం హెచ్ ఓ డా. రాజారెడ్డి ఏం హెచ్ ఓ డా. రాజేష్ సానిటరీ సూపర్ వైజర్ లు గోల్కొండ శ్రీను నరేందర్ ఏ ఈ రాగి శ్రీకాంత్ శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ వర్క్ ఇన్స్పెక్టర్ కంటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్ లాంగ్వేజి శిక్షణ అభినందనీయం

- ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి పనితీరు భేష్
- సంస్థ వైస్ చైర్ పర్సన్ శాంతి కుమారి



**కరీంనగర్ సెప్టెంబర్26( సమయం న్యూస్). :** డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం పరిధిలోని కరీంనగర్ ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని ఆ సంస్థ వైస్ చైర్ పర్సన్ శాంతి కుమారి శుక్రవారం సందర్శించారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఇస్తున్న శిక్షణల వివరాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్య అభివృద్ధికి కేంద్రంలో ఇచ్చిన శిక్షణ వివరాలను తెలిపారు. సైన్ లాంగ్వేజి శిక్షణ గురించి వైస్ చైర్ పర్సన్ వివరాలు అడిగారు. ఈ శిక్షణ కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే కాకుండా ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది, బధిర విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలతో నిరంతరం కమ్యూనికేషన్ అవసరమైన ఉద్యోగులు, అధికారులకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రెండు బ్యాచీలలో శిక్షణ పూర్తి చేసామని, మరింత మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో శిక్షణ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ ని వైస్ చైర్ పర్సన్ శాంతి కుమారి అభినందించారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఉన్న సౌకర్యాలు, శిక్షణ విధానం, శిక్షణకు అవసరమైన ఉద్యోగుల ఎంపిక తదితర వివరాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, ప్రాంతీయ శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- బాలల రక్షణ సంరక్షణ కోసం కృషి చేయాలి
- సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి
- అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



**హన్మకొండ సెప్టెంబర్26( సమయం న్యూస్):** హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్) శుక్రవారం రోజున అదనపు కలెక్టర్ ఏ వెంకట్ రెడ్డి తనిఖీ చేశారు,అదనపు కలెక్టర్ తో జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులతో కలిసి రెవిన్యూ కాలనీలోని ఒయాసిస్ ఓపెన్ షెల్టర్ ఫర్ బాయ్స్, హన్మకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రాలను తనిఖీ చేసారు, నిబంధనల మేరకు కనీస ప్రమాణాలు పాటించాలని, ముఖ్యంగా భవనాలకు సంబంధించిన సౌండ్నెస్, ఫిట్నెస్ సర్టిఫికెట్ లను సంబంధిత అధికారులు జారీ చేయుటకు ఇటీవలే సంబంధిత శాఖల అధికారులకు లేఖ రాశామని తెలిపారు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, శానిటేషన్, వాటర్ ప్యూరిఫికేశన్ సంబంధిత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు, ఈ సందర్భంగా తనిఖీ చేసిన కేంద్రాలలో డార్మెటరీ, వాష్ రూమ్స్, డైనింగ్ హాల్, పరిసరాలను పరిశీలించారు, రికార్డులను, పిల్లలకు అందిస్తున్న ఆరోగ్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లైసెన్స్ కలిగి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకొనే సంస్థలు తప్పకుండా కనీస ప్రమాణాలు పాటిం చాలని లేనిచో నిబంధనల మేరకు చర్యలుం టాయని అన్నారు. కార్యక్రమంలో బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికి సుధాకర్, ఇన్చార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం క్రిష్ణ కళ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

# ఫైనల్‌లో పాకిస్తాన్‌తో తలపడనున్న భారత్



ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ భారత్, పాకిస్తాన్ మధ్య జరగనుంది. ఆసియా కప్ చరిత్రలో ఇరు జట్లు టైటిల్ కోసం తలపడటం ఇదే తొలిసారి. ఈ సీజన్‌లో ఇరు జట్లు 2 సార్లు తలపడ్డాయి. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ టీమ్ ఇండియానే గెలిచింది. అయితే ఇప్పుడు ఫైనల్, సూర్యకుమార్ యాదవ్ అండ్ టీమ్ సల్మాన్ అలీ ఆగా, అతని ఆటగాళ్లను తేలిగ్గా తీసుకోకూడదు భారత క్రికెట్ జట్టు గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌లను గెలుచుకుంది, ఇందులో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ కూడా ఉంది. సూపర్-4లో రెండు మ్యాచ్‌లు గెలిచి టీమ్ ఇండియా ఆసియా కప్ 2025 ఫైనల్‌కు చేరుకుంది, దీని మొదటి మ్యాచ్ కూడా పాకిస్తాన్‌తోనే జరిగింది. సూపర్-4లో మొదటి మ్యాచ్‌లో టీమ్ ఇండియాతో ఓడిపోయిన తర్వాత పాకిస్తాన్ శ్రీలంక, బంగ్లాదేశ్‌లను ఓడించింది. ఫైనల్ మ్యాచ్ ఆదివారం, సెప్టెంబర్ 28న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. భారతదేశం సమయం ప్రకారం ఫైనల్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ సమయంలో యూఏఈలో సాయంత్రం 6:30 అవుతుంది.గ్రూప్ దశలో ఈ రెండు జట్లు తలపడినప్పుడు భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు తీశాడు. భారత్ తరఫున సూర్యకుమార్ యాదవ్ (47) అత్యధిక పరుగులు చేశాడు. సూపర్-4లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది, అభిషేక్ శర్మ పాకిస్తాన్ బౌలర్లను చితకబాదాడు. అతను 39 బంతుల్లో 74 పరుగులు చేశాడు. ఇప్పుడు వరుసగా మూడో ఆదివారం మరోసారి భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరగనుంది, అయితే ఇది గత రెండు మ్యాచ్‌ల కంటే పెద్దది. ఎందుకంటే ఇది టైటిల్ కోసం పోరాటం. ఇప్పటికే రెండుసార్లు ఓడిపోయి తీవ్ర అవమానాలు ఎదుర్కొంటున్న పాకిస్తాన్ ఎలాగైనా భారత్‌పై పైచేయి సాధించాలనే కసితో ఉంది. అందుకే ఈసారి కచ్చితంగా భారత్ అందుకు తగ్గట్టుగానే పకడ్బంధిగా రెడీ అవుతోంది. సెప్టెంబర్ 2022లో పాకిస్తాన్ భారత్‌ను ఓడించింది, ఆ తర్వాత భారత్ పాకిస్తాన్‌ను వరుసగా 5 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఓడించింది. హెడ్ టు హెడ్‌లో భారత్దే పైచేయి. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఆసియా కప్‌కు అధికారిక బ్రాడ్‌కాస్టర్. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.సోనీ లివ్ , ఫ్యాన్ కోడ్ యాప్, వెబ్‌సైట్‌లో భారత్, పాకిస్తాన్ ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.

# టీమిండియా టెస్ట్ టీమ్ నుంచి కరుణ్ నాయర్ ఔట్..



వెస్టిండీస్‌తో సొంతగడ్డపై జరిగే టెస్ట్ సిరీస్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కలేదు. 8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఇంగ్లండ్ పర్యటనలో నాలుగు టెస్ట్‌ల్లో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. దాంతో అతనిపై వేటు పడింది. తాజాగా తన వేటుపై స్పందించిన కరుణ్ నాయర్ నిరాశ వ్యక్తం చేశాడు. తనను ఎందుకు తప్పించారో తెలియదని, సెలెక్టర్లనే అడగాలని తెలిపాడు.'నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మాటలు రావడం లేదు. దీని గురించి మీరు సెలెక్టర్లనే అడగాలి. ఇంగ్లండ్‌తో ఆఖరి టెస్ట్‌లో నేను 50 పరుగులు చేశాను. తొలి ఇన్నింగ్స్‌లో నేనే టాప్ స్కోరర్‌గా నిలిచాను. జట్టుకు నా వంతు సహాయ సహకారాన్ని అందించాను. ముఖ్యంగా ఆ మ్యాచ్‌లో మేం విజయం సాధించాం. కానీ సెలెక్టర్లు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. నాకు జట్టులో స్థానం ఉంటుందని భావించాను.ప్రస్తుతానికి నేను చేయగలిగేది కూడా ఏమీ లేదు. నేను మరింత కష్టపడాలి. నా కెరీర్ గురించి నేను చాలా క్లారిటీతో ఉన్నాను. నా సాయశక్తులా ప్రయత్నించాను. కానీ సెలెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. వారి నిర్ణయాన్ని గౌరవించాలి. ఇప్పుడు నేను రంజీ ట్రోఫీ కోసం సిద్ధమవుతున్నాను.'అని కరుణ్ నాయర్ చెప్పుకొచ్చాడు.ఇంగ్లండ్ పర్యటనలో తాము ఆశించిన రీతిలో రాణించకపోవడంతోనే కరుణ్ నాయర్‌పై వేటు వేసామని భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వివరణ ఇచ్చాడు. జట్టు ప్రకటన అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో కరుణ్ నాయర్ నుంచి మేం మరింత నిలకడైన ప్రదర్శనను ఆశించాం. ఒక్క ఇన్నింగ్స్ గురించి మాట్లాడటం సరికాదు. ప్రస్తుతం సమయంలో పడిక్కల్ కాస్త మెరుగైన ప్రదర్శన ఇవ్వగలడని మేం భావిస్తున్నాం. మేం అందరికీ 15-20 టెస్ట్ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఇవ్వలేం.'అని గవాస్కర్ సమాధానమిచ్చాడు. అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్ వేదికగా భారత్, వెస్టిండీస్ మధ్య తొలి టెస్ట్ ప్రారంభం కానుంది.

**వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ఎంపికైన భారత జట్టు..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రవీంద్ర జడేజా(వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్,కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, ఎన్. జగదీశన్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్.

# ముంబై ఇండియన్స్‌లోకి సునీల్ గవాస్కర్..?





సునీల్ గవాస్కర్.. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ఆడాలనుకుంటున్నాడు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించాడు. తనను ముంబై ఇండియన్స్ జట్టులోకి తీసుకోవాలని ఆ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాను కోరినట్లు తెలిపాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఆసియా కప్ 2025 టోర్నీలో టీమిండియా దుమ్మురేపుతోంది. వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. గత బుధవారం బంగ్లాదేశ్‌తో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతోనే ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆసియా కప్ టోర్నీకి సునీల్ గవాస్కర్ కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్నాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్ అనంతరం సునీల్ గవాస్కర్.. హార్దిక్ పాండ్యా సుదీర్ఘంగా మాట్లాడాడు. ఈ సంభాషణ గురించి అధికారిక బ్రాడ్‌కాస్టర్ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ హోస్ట్ ప్రశ్నించాడు.హార్దిక్ పాండ్యాతో ఏం మాట్లాడారని వివరణ కోరాడు. ఇందుకు సునీల్ గవాస్కర్ తనదైన శైలిలో సమాధానమిచ్చి నవ్వులు పూయించాడు. ముంబై ఇండియన్స్ కెప్టెప్ అయిన హార్దిక్ పాండ్యాను ఐపీఎల్‌లో తనను పరిగణలోకి తీసుకోవాలని కోరానని చెప్పాడు. దాంతో హోస్ట్ పగలబడి నవ్వాడు. ఈ వీడియోపై నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. ఎటకారంలో గవాస్కర్‌ను మించినోడు లేడని కామెంట్ చేస్తున్నారు. తన కెరీర్‌లో 125 టెస్ట్‌లు ఆడిన గవాస్కర్ 10122 పరుగులు చేశాడు. ఇందులో 34 శతకాలు ఉన్నాయి. 108 వన్డేల్లో 3092 పరుగులతో రాణించాడు. 1983 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సునీల్ గవాస్కర్ ఒక సభ్యుడు. అతని సారథ్యంలో టీమిండియా వరల్డ్ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలిచింది.మరోవైపు ముంబై ఇండియన్స్‌తోనే తన ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన హార్దిక్ పాండ్యా 2021 వరకు ఆ జట్టుకే ఆడాడు. ఐపీఎల్ 2022 మెగా వేలానికి ముందు అతను గుజరాత్ టైటాన్స్‌కు వెళ్లి ఆ జట్టు సారథ్యం బాధ్యతలు చేపట్టాడు. అరంగేట్ర సీజన్‌లోనే టైటిల్ అందించిన హార్దిక్ పాండ్యా.. ఆ మరుసటి ఏడాది రన్నరప్ టైటిల్ అందుకున్నాడు. ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు క్యాష్ డీల్ ట్రేడింగ్ ద్వారా ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చి సారథ్య బాధ్యతలు చేపట్టాడు. అయితే ఐపీఎల్ 2020 నుంచి ముంబై ఇండియన్స్ ఒక్క టైటిల్ కూడా గెలవలేదు.

# భారత్‌ను ఓడించడం పాకిస్థాన్‌కు చాలా కష్టం

## పాకిస్థాన్ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్



ఆసియా కప్ 2025 టోర్నీలో మ-రోసారి భారత్, పాకిస్థాన్ జట్లు తలపడున్నాయి. ఇరు జట్లు ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాయి. ఆదివారం జరిగే ఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ టోర్నీలో ఇప్పటికే దాయాదీ దేశాలు రెండు సార్లు తలపడ్డాయి. అయితే ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ పాకిస్థాన్‌ను భారత్ చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలిచిన భారత్.. రెండో మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓడించింది. ముచ్చటగా మూడోసారి భారత్, పాక్‌లు ఫైనల్లో తలపడుతున్నాయి.ఆసియా కప్ చరిత్రలోనే భారత్, పాక్‌లు ఫైనల్లో తలపడటం ఇదే తొలిసారి. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు ఫైనల్లో భారత్‌ను ఓడిస్తామని పాకిస్థాన్ ఆటగాళ్లు సవాల్ విసిరారు. దాంతో ఈ మ్యాచ్‌పై మరింత హైప్ క్రియేట్ అయ్యింది.హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన భారత్‌ను ఓడించడం పాకిస్థాన్‌కు చాలా కష్టమని ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్ అన్నాడు. అయితే టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మను త్వరగా ఔట్ చేస్తే భారత్‌ను ఓడించవచ్చని పాక్ ఆటగాళ్లకు సూచించాడు. 'భారత్‌తో మ్యాచ్ అనగానే ఒత్తిడికి గురయ్యే మైండ్‌సెట్ నుంచి పాకిస్థాన్ ఆటగాళ్లు బయటకు రావాలి. బంగ్లాదేశ్‌పై ఎలా ఆడారో అలాగే భారత్‌ను ఓడించాలి. మొత్తం 20 ఓవర్లూ బౌలింగ్ చేయకుండా.. 10 వికెట్లు తీసేందుకు ప్రయత్నించాలి.ముఖ్యంగా అభిషేక్ శర్మను తొలి మూడు ఓవర్లలోనే ఔట్ చేయాలి. అప్పుడే భారత్‌పై ఒత్తిడి పెట్టవచ్చు. భారత్‌కు ఇప్పటి వరకు వచ్చిన ఆరంభాలన్నీ అభిషేక్ శర్మ అందించినవే. అభిషేక్ శర్మను ఔట్ చేయకపోతే మాత్రం పాకిస్థాన్ గెలవడం కష్టం. అభిషేక్ తప్పిదం చేయడం కూడా చాలా తక్కువ. కాబట్టి అతనిపై అటాకింగ్ బౌలింగ్ చేయాలి. అప్పుడే మిగతా భారత్ బ్యాటర్లు ఆచితూచి ఆడేందుకు ప్రయత్నిస్తారు. పరుగుల కోసం కష్టపడుతారు. అయితే భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అక్కడ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఉన్నాడు. పాక్‌పై టాప్ క్లాస్ ఆటను ఆడాలని భారత్‌కు చెబుతాడు. చెత్త జట్టుతో దిగినా.. నాసికరంగా ఆడినా.. పాక్ ఫైనల్ చేరుకుంది. తుదిపోరులో మాత్రం దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తారని భావిస్తున్నా.'అని షోయబ్ అక్తర్ చెప్పుకొచ్చాడు.

# భారత్‌ను రెచ్చగొట్టేందుకు ఆ సైగలు చేయలేదు

## పాకిస్థాన్ పేసర్ హరీస్ రౌఫ్



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) ముందు పాకిస్థాన్ పేసర్ హరీస్ రౌఫ్ ఎలాంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. తాను ఎలాంటి తప్పిదం చేయలేదని గట్టిగా వాదించినట్లు తెలుస్తోంది. ఆసియా కప్ 2025 టోర్నీలో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో హరీస్ రౌఫ్ వివాదాస్పద సంజ్ఞలు చేసిన సంగతి తెలిసిందే. భారత్‌కు చెందిన జెట్ ఫ్లైట్స్‌ను కూల్చేశామని ప్రేక్షకులకు తెలియజేస్తూ .. 6-0 అనే సంజ్ఞలు చేశాడు.పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత సాయుధ బలగాలు ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిభిరాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ దాడుల సమయంలో భారత్‌కు చెందిన 6 రాఫెల్ యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ అబద్ధపు ప్రకటన చేసింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఇప్పటి వరకు ప్రపంచానికి చూపించలేదు. కానీ భారత్‌పై తామే యుద్ధం గెలిచామని సంబరాలు చేసుకుంది. భారత్‌తో మ్యాచ్‌లోనూ ఇదే విషయాన్ని తెలియజేస్తూ హరీస్ రౌఫ్ 6-0 సంజ్ఞలు చేశాడు. అంతేకాకుండా కవ్వింపులకు పాల్పడుతూ భారత్ ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు.అయితే హరీస్ రౌఫ్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా భారత అభిమానులు అతన్ని సోషల్ మీడియా వేదికగా ఏకిపారేసారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే అతన్ని ఐసీసీ వివరణ కోరగా.. తాను భారత్‌ను ఉద్దేశించి ఆ సంజ్ఞలు చేయలేదని వాదించినట్లు సమాచారం. హాఫ్ సెంచరీ అనంతరం గన్ ఎక్కుపెట్టి సంబరాలు చేసుకున్న పాకిస్థాన్ ఓపెనర్ సహిబ్‌జాద్ ఫర్హాన్ సైతం.. ఇదే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తన సంబరాల వెనుక ఎలాంటి రాజకీయపరమైన చర్య లేదని, గతంలో ధోనీ, కోహ్లీ కూడా ఇలా సంబరాలు చేసుకున్నారని ఫర్హాన్ ఐసీసీకి వివరణ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరి మ్యాచ్ ఫీజులో ఐసీసీ కోత విధించే అవకాశం ఉంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన చేయనుంది. క్రికెట్ మ్యాచ్‌లో రాజకీయపరమైన విషయాలను ప్రస్తావించడం, సంజ్ఞలు చేయడం రూల్స్‌కు విరుద్ధం. ఇక పాక్‌పై విజయాన్ని భారత సాయుధ బలగాలకు అంకితం చేసిన సూర్యకుమార్ యాదవ్‌ను కూడా ఐసీసీ మందలించింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయవద్దని, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

# 9 ఫోర్లు, 12 సిక్సర్లతో వైభవ్ సంభవం



టీమిండియా అండర్ 19 ఆటగాడు వైభవ్ సూర్యవంశీ తన తొలి ఆస్ట్రేలియా వైట్-బాల్ సిరీస్‌లో 124 పరుగులు చేసి అదరగొట్టాడు. ఇంగ్లాండ్ పర్యటనలో తన ప్రతాపం చూపించిన వైభవ్.. ఇప్పుడుమరోసారి తన బ్యాట్‌తో రుచి చూపించాడు. ఆస్ట్రేలియాలో జరిగిన మూడు మ్యాచ్‌ల అండర్-19 వన్డే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ 110 బంతులు ఎదుర్కొని 41.33 సగటు, 112.72 స్ట్రైక్ రేట్‌తో కేవలం 124 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లలో అతడి బ్యాట్ నుంచి 9 సిక్సర్లు, 12 ఫోర్లు వచ్చాయి. ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్ అండర్-19 జట్టు సిరీస్ గెలుచుకుంది. సెప్టెంబర్ 24న బ్రిస్బేన్‌లోని ఇయాన్ హీలీ ఓవల్‌లో జరిగిన రెండవ యూత్ వన్డేలో భారత అండర్ 19 జట్టు ఆస్ట్రేలియా అండర్ 19 జట్టును 51 పరుగుల తేడాతో ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా జట్టుకు వైభవ్ సూర్యవంశీ (68 బంతుల్లో 70), విహాన్ మల్హోత్రా (74 బంతుల్లో 70), అభిజ్ఞాన్ కుందు (64 బంతుల్లో 71) అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో 49.4 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌటైంది. దీనికి సమాధానంగా ఆస్ట్రేలియా 47.2 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే(3/27, 4 ఓవర్లు) మూడు వికెట్లు పడగొట్టి కీలక పాత్ర పోషించాడు. మరోవైపు కనిష్క్ చౌహాన్ పది ఓవర్లలో రెండు వికెట్లు (2/50) తీసుకున్నాడు. ఆయుష్ మాత్రే రెండు బంతుల్లోనే డకౌట్ అయి పెవిలియన్‌కు చేరడంతో భారత్‌కు గొప్ప ఆరంభం లభించలేదు. ఆ తర్వాత విహాన్ మల్హోత్రా, వైభవ్ సూర్యవంశీతో కలిసి 111 బంతుల్లో రెండో వికెట్‌కు 117 పరుగులు జోడించారు. సూర్యవంశీ 54 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. తన మైలురాయిని చేరుకున్న తర్వాత గేర్ మార్చి.. మొత్తంగా 68 బంతుల్లో 70 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతడు అవుట్ అనంతరం విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుందు భారత్ 300 పరుగులు చేయడంలో సహాయపడ్డారు.






## ఓజీ తొలిరోజు 154 కోట్ల కలెక్షన్

సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన 'ఓజీ' విడుదలైంది. ఫ్యాన్స్ ఆశించినట్టే హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఫస్ట్ డే కలెక్షన్స్ ఎంత వసూలు చేసిందన్న ప్రశ్నకు చిత్ర బృందం తాజాగా సమాధానమిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు రూ.154కోట్లకుపైగా వసూలు చేసిందని నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్-టైన్‌మెంట్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఈ మేరకు పవర్‌ఫుల్ పోస్టర్ పంచుకుంటూ 'ఇది పవన్ కల్యాణ్ సినిమా. చరిత్రను ఓజీ చెరిపేసింది' అని క్యాప్షన్ పెట్టింది.

# ఓజీ విజయం..

## సుజిత్ త్యాగాలకు నిదర్శనం

'ఓజీ' సినిమా విజయం ఆ దర్శకుడు చేసిన త్యాగాలకు నిదర్శనమని నటి శ్రియారెడ్డి అన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ మూవీలో గీతగా శ్రియారెడ్డి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. తాజాగా ఆమె సుజీత్‌పై ప్రశంసలు కురిపిస్తూ ఓ పోస్ట్ పెట్టారు. సుజీత్ రాసిన పాత్ర తెరపై మరోసారి అద్భుతం సృష్టించింది. 'ఓజీ'లాంటి సినిమాను అంగీకరించడానికి అంత పెద్ద ప్రాజెక్ట్‌లో గుర్తింపు తెచ్చుకోవడానికి ఆత్మవిశ్వాసం ఉన్న దర్శకుడు అవసరం. సుజీత్ అలాంటి దర్శకుడే. ఈ పాత్రకు నన్ను ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు. ఉన్నతంగా ఆలోచించినప్పుడు ఇలాంటి అద్భుతాలు జరుగుతాయి. నేను చూసిన గొప్ప వ్యక్తుల్లో మీరూ ఒకరు. ఈ విజయానికి పూర్తి అర్హులు. మీ కృషి, విశ్వాసం, మీరు చేసిన త్యాగాలు అన్నీ ఈ విజయానికి నిదర్శనం అంటూ పోస్ట్‌లో రాసుకొచ్చారు. గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన 'ఓజీ'ని ఇప్పటికే సినీ ప్రముఖులు వీక్షించి రివ్యూలు ఇచ్చారు. తాజాగా ఈ చిత్రాన్ని చూడడం కోసమే హైదరాబాద్ వచ్చినట్లు కోలీవుడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ తెలిపారు. 'ఈ మాస్ చిత్రాన్ని తెలుగు ఆడియన్స్‌తో కలిసి చూస్తేనే కదా అసలైన ఆనందం' అని తాను సినిమా చూస్తోన్న వీడియోను పంచుకున్నారు.






## ఓటీటీలోకి వస్తున్న మదరాసి

అమరన్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత 'మదరాసి' అంటూ వచ్చి సూపర్ హిట్‌ను అందుకున్నాడు తమిళ నటుడు శివ కార్తికేయన్. మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించడమే కాకుండా రూ.80 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీ-అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం అక్టోబర్ 1నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు- చిత్రబృందం ప్రకటించింది.

## వెంకీ సినిమా కోసం త్రివిక్రమ్ కొత్త టీమ్

**సంక్రాంతికి వస్తున్నాం** చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్న నటుడు విక్టరీ వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న చిత్రయూనిట్ అక్టోబర్‌లో రెగ్యూలర్ షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. వెంకీ 77 అనే వర్కింగ్ -టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా ఒక విషయం వైరల్‌గా మారింది. ఈ సినిమా కోసం త్రివిక్రమ్ తన టీమ్ మొత్తాన్ని మార్చినట్లు- తెలుస్తుంది. కొత్తవారిని ఈ సినిమా కోసం తీసుకున్నట్లు- ఫిల్మ్ నగర్‌లో టాక్ నడుస్తుంది. అయితే ఇది ఎంతవరకు నిజం అనేది తెలియాల్సి ఉంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శకుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అవ్వడంతో అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.



### ఓటిటిలోకి మళయాళ హిట్ మూవీ

# హృదయపూర్వం



విలక్షణ పాత్రలతో మెప్పించే మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ నటించిన తాజా చిత్రం 'హృదయపూర్వం'. బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లు వసూలుచేసిన ఈ మూవీ ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న సందీప్ బాలకృష్ణన్ (మోహన్‌లాల్)కు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఆర్మీ కర్నల్ రవిచంద్రన్ గుండెను వైద్యులు అమరుస్తారు. అతడి ఆరోగ్యం కుదుటపడేవరకూ సహాయం చేయడానికి తోడుగా జెర్రీ (సంగీత్ ప్రతాప్)ను ఆస్పత్రి నియమిస్తుంది. సందీప్ తాను నడుపుతున్న క్లౌడ్ కిచెన్ వ్యవహారాలు చూసుకుంటూ ఉండగా, కర్నల్ రవిచంద్రన్ కుమార్తె హరిత (మాళవిక మోహనన్) అతడి దగ్గరకు వస్తుంది. తనకు నిశ్చితార్థం కుదిరిందని, ఆ వేడుకకు రావాలని కోరుతుంది. తొలుత రానని చెప్పినా, ఆ తర్వాత జెర్రీతో కలిసి సందీప్ పుణె వెళ్తాడు. మరి అక్కడికి వెళ్లాక అతడికి ఎదురైన పరిస్థితులు ఏంటి? హరిత నిశ్చితార్థం ఆగిపోవడానికి కారణం ఎవరు? కర్నల్ రవి భార్య, కుమార్తె హరిత.. సందీప్‌పై చూపిన ప్రేమ, ఆప్యాయత ఎలాంటి పరిస్థితులకు దారితీసింది? తెలియాలంటే సినిమా చూడాల్సిందే. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి మరణించిన వేరొకరి అవయవాలను అమర్చడం ఒకరకంగా ఇద్దరికీ పునర్జన్మ ఇచ్చినట్లే. ఈ నేపథ్యంతో ఇప్పటికే ఎన్నో కథలు వచ్చాయి. 'హృదయపూర్వం' కూడా ఈతరహా నేపథ్యమే అయినా, దర్శకుడు సత్యన్ అంతికాడ్ దీనిని ఒక అందమైన ప్రయాణంలా తీర్చిదిద్ది ప్రేక్షకులను మెప్పించారు. అందుకే మలయాళంలో బాక్సాఫీస్ వద్ద డీసెంట్ హిట్ అందుకుంది.

కర్నల్ రవిచంద్రన్ గుండెను సందీప్‌కు అమర్చడంతోనే నేరుగా కథను ప్రారంభించాడు దర్శకుడు. ఆ తర్వాత నెమ్మదిగా సందీప్ నేపథ్యం, అతడి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఆవిష్కరించాడు. సందీప్, జెర్రీలు పుణె వెళ్లిన తర్వాత కథలో అసలైన సంఘర్షణ మొదలవుతుంది. అనుకోకుండా హరిత నిశ్చితార్థం ఆగిపోవడం, సందీప్ రెండు వారాల పాటు- పుణెలో ఉండాల్సిన పరిస్థితి తలెత్తుంది. ఇక్కడినుంచి కథ రొమాంటిక్ టర్న్ తీసుకుంటుంది. హరిత ఇంటికి సందీప్ వెళ్లిన దగ్గరి నుంచి వారి మధ్య వచ్చే సన్నివేశాలు సరదాగా సాగిపోతూ చక్కటి వినోదాన్ని పంచుతాయి. అటు తల్లి, ఇటు- కుమార్తె సందీప్‌పై చూపే చొరవ, దానిని అతడు అర్థం చేసుకొనే తీరు, మధ్యలో జెర్రీ చేసే హంగామా అలరిస్తుంది. సందీప్‌ను వెతక్కుంటూ అతడి బావ పణికర్ పుణెకు వచ్చిన తర్వాత వినోదం పాళ్లు మరింత పెరుగుతాయి. ఒక బలమైన ఎమోషనల్ నోట్‌తో సినిమాను ముగించిన తీరు బాగుంది. సందీప్ బాలకృష్ణన్ వంటి పాత్రలు చేయడం మోహన్‌లాల్‌కు వెన్నతో పెట్టిన విద్య. అయితే, ఆ పాత్రకు ఎంత చేయాలో అంతే చేశారు. ఆయన చేసే ఒక్క ఫైట్ కూడా చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఇక జెర్రీగా సంగీత్ నవ్వులు పంచాడు. హరితగా మాళవిక మోహనన్, ఆమె తల్లి పాత్రలో సంగీత మాధవన్ నాయర్ ఒదిగిపోయారు. సందీప్ బావ పాత్రలో సిద్ధిఖీ నటన మరో హైలైట్. ఆయన ఉన్నంతసేపు స్క్రీన్‌పై నవ్వుల టపాసులు పేలుతూనే ఉంటాయి. సాంకేతికంగా సినిమా బాగానే ఉంది. జియో హాట్‌స్టార్ వేదికగా తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతోంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**